# గుంటూరు వార్త

## ప్రకృతి సాగు రైతు రోశయ్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంస

**కొల్లిపర, మార్చి 13, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలోని అత్తోట గ్రామానికి చెందిన రైతు రోశయ్య 75 సెంట్ల భూమిలో 52 రకాల పంటలు సాగుచేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో ప్రకృతి సేద్యంతో అద్భుతాలు సృష్టిస్తున్న రోశయ్యకు ప్రణామాలు అంటూ పేర్కొన్నారు. నెలకు రూ.20 వేలకు పైగా ఆదాయం సాధిస్తున్న రైతును చంద్రబాబు మెచ్చుకున్నారు. 2016లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలతో ప్రేరణ పొంది ప్రకృతి సాగు చేపట్టిన రోశయ్య సాధిస్తున్న విజయాలు ఆదర్శమని చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భూమిని తల్లిగా భావించి రైతు రోశయ్య ప్రగతి సాధించడం విశేషమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.





## పజా గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మార్చి13, ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి



గారు నిర్వహించారు. ప్రజల సమస్యలు, వారి అర్జీల స్వీకరణ, సత్వర పరిష్కారం ఇవన్నీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రీవెన్స్ డేలో భాగమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తెలిపారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజల అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు అన్ని ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలో అప్ చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తెలిపారు.

## లాలాపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి నిధులు కేటాయింపు

**గుంటూరు, మార్చి 13, ప్రభాతవార్త :** గుంటూరు తూర్పు నియోతెలిపారులోని లాలాపేటలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ చేసిన కృషి ఫలించింది. ఆలయ నిర్మాణానికి 2 కోట్ల రూపాయల నిధులు అవసరమని ప్రణాళికలు



రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ మేరకు సీఎస్ఎఫ్ నిధులు రూ.,1.33 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో గుంటూరు నగరంలోని పద్మావతి హాస్పిటల్స్ వైద్యులు వీరంగంధం వెంకట సుబ్బారావు రూ.57 లక్షల విలువైన చెక్కులు ఎమ్మెల్యే నసీర్కు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి దాతల కృషి అభినందనీయమని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆలయాల విధ్వంసానికి పూనుకున్నారని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూల తయారీలో కల్తీలాంటి మహాపచారానికి వైసీపీ నేతలు పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రభుత్వంలో అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల పవిత్రతను కాపాడేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 9 వేలకుపైగా ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.772 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 361 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు వేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 5,523 చిన్న దేవాలయాలకు నెలకు రూ.10 వేల చొప్పున ధూపదీప నైవేద్యాల కోసం అందిస్తున్నట్లు చెప్పారు.

## లక్ష్మీపురం ప్రధాన రహదారి రోడ్డుకు ఇరువైపులా శరవేగంగా జరుగుతున్న డ్రైన్ల నిర్మాణ పనులు

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 13 ( ప్రభాతవార్త ) :** గుంటూరు నగరంలోని లక్షీ మ్రపురం ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ రోడ్డుకు ఇరువైపులా మేజర్ డ్రైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులను గుర్తించి కాంట్రాక్టర్ను, అధికారులను పిలిపించి కమిషనర్ ఏ మయూరి అశోక్ హెచ్చరికలు జారీ చేయడంతో పనులను డ్రైన్ పనులు ప్రారంభించి వేగవంతంగా చేస్తున్నారు. గుంటూరు నగరంలో పలు అభివృద్ధి పనులకు టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.



## 40మంది ఏఎన్‌యు విద్యార్థులకు ఉద్యోగాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి13, ప్రభాతవార్త:** ఏఎన్‌యు విద్యార్థులు 40మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం బెంగుళూరులోని బిఎస్‌బి నెక్ట్స్ జన్‌ల్యాబ్స్ లైఫ్ సైన్సెస్ ఏఐ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. సిఎస్‌సి ఇంజనీరింగ్‌తో పాటు ఎంసిఏ, ఎంఎస్‌సి డేటా సైన్స్, ఎంబిఏలోని 4 బ్రాంచ్‌లు, బి.ఫార్మశీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. లింగరాజులు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఎంపికైన వారికి ట్రైనింగ్‌లో ఏడాదికి రూ.2.2 లక్షలు, అనంతరం 3.5లక్షలు వేతనంగా ప్యాకేజి ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌బి నెక్ట్స్ జన్‌ల్యాబ్స్ లైఫ్ సైన్సెస్ ఏఐ సంస్థ సిఇఓ డాక్టర్ ప్రేమ్ బట్టు, హెచ్‌ఆర్ మహేష్, ఏపి సీనియర్ మేనేజర్ సిహెచ్ మోహన్, పుష్పలత, టిపిఓ దిలీప్, , అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, కోఆర్డినేటర్‌లు సతీష్‌కుమార్, చైతన్య, పుణ్యాశేఖర్‌లు పాల్గొన్నారు.





## 3గ్గురి పై సస్పెన్షన్ వేటు

-బతికుండగానే చంపేసి కోట్లు విలువ చేసే భూములు మ్యుటేషన్
-తహశీల్దార్, ఆర్ఐ సహా ఇరువురు వీఆర్వోలను సస్పెండ్ చేసిన కలెక్టర్

**గుంటూరు మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరు జిల్లా తాడికొండ మండల తహశీల్దార్ మెహర్ కుమార్, ఆర్ఐ హనుమంతరావు, వీఆర్వోలు బ్రహ్మయ్య, రాంబాబుల పై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెన్షన్ వేటు వేశారు. ఓ భూమి మ్యుటేషన్ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా, లోపబోయిష్టంగా చేపట్టడం పట్ల విచారణ చేపట్టి తహశీల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తో సహా ఇద్దరు వీఆర్వోలను సస్పెండ్ చేశారు. ఇటువంటి తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

**బతికుండగానే చంపేసి..ముడుపుల మత్తులో మ్యుటేషన్ చేసి..**



గుంటూరు జిల్లా తాడికొండ మండలం తాడికొండ గ్రామానికి చెందిన వంగర హనుమంత సుబ్రహ్మణ్య శాస్త్రి కి అదే గ్రామంలో సర్వే నెంబర్ 1151లో 8.32 ఎకరాల భూమి ఉంది. ఆయన ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడగా తనకున్న భూమిని పెదపరిమి గ్రామానికి చెందిన ఓ రైతుకు కౌలుకు ఇచ్చారు. ఇదిలావుండగా ఈ భూమిపై కన్నేసిన కొందరు అక్రమంగా కొట్టేయడానికి పక్కాగా స్కెచ్ వేశారు. హనుమంత శాస్త్రి బతికుండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్, వీలునామా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తో పాటు ఓ మహిళను దత్తత తీసుకున్నట్లు చూపించారు. 8.82 ఎకరాల భూమిని ఆన్లైన్లో పేరు మార్చి వీలునామా ద్వారా ఆ మహిళకు సంక్రమించినట్లుగా మ్యుటేషన్ చేయించారు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న భూమి అసలు హక్కుదారుడు హుటాహుటిన అమెరికా నుండి బయలుదేరి తాడికొండలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**అక్రమార్కులకు కొమ్ముకాసిన రెవెన్యూ అధికారులు..**

రాజధాని అమరావతి పుణ్యమా అంటూ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రజల, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారు. డబ్బుకు ఆశపడి ఎంతటి నీచానికైనా దిగజారుతున్నారు. తాడికొండ వ్యవహారంలో మ్యుటేషన్ దరఖాస్తులను కనీసం ఫీల్డ్ విజిట్ చేయకుండానే అడంగల్, 1బి రికార్డుల్లో పేర్లు నమోదు చేశారు. బతికుండగానే నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో మ్యుటేషన్ చేసి కోట్ల విలువ చేసే భూమిని అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టారు. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో వ్యవహారం బయటకు పొక్కింది. గతంలో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కు ఈ వ్యవహారం పై స్థానికులు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీవోతో విచారణ చేయించి బాధ్యులను సస్పెండ్ చేయిస్తానని ఆయన ఆనాడు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన ఆర్డీవో శ్రీనివాసరావు స్థానిక తహశీల్దార్, ఆర్ ఐ, ఇరువురు విఆర్వోలు ఈ వ్యవహారంలో బాధ్యతలని జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇవ్వడంతో బాధ్యుల పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

## విద్యార్థి మృతదేహంతో కలెక్టరేట్ ఎదుట తల్లిదండ్రులు బైఠాయింపు స్పందించిన జిల్లా కలెక్టర్

**గుంటూరు విద్య మార్చి 13,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో కొత్తపేట శ్రీ కాసు సాయమ్మ మున్సిపల్ హై స్కూల్ లో చదువుకునేటటువంటి ఓ విద్యార్థి, అదే స్కూల్లో 10వ తరగతి





చదువుతున్న భరత్ కుమార్ అనే విద్యార్థినీ కొన్ని రోజుల క్రితం బలంగా కొట్టడంతో మెడ భాగంలో గాయం కావడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడనీ , ఆ విద్యార్థి మరణానికి కారణమైనటువంటి స్కూల్ యాజమాన్యంపై ఎంఈఓ పై కఠినమైన చర్యలు తీసుకోవాలనీ కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ విద్యార్థి తల్లిదండ్రులు బంధువులు ఎన్ స్ యు ఐ సంఘ నాయకులు విద్యార్థి మృతదేహాన్ని రోడ్డుపై పెట్టి బయటయింపు జరిపారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రధాన గేటు వద్దకు కారులో వచ్చి సామరస్యంగా సమస్యను తెలుసుకున్నారు. బాధితులు ఏడుస్తూ కలెక్టర్ కాళ్లు పట్టుకొని మాకు న్యాయం చేయాలంటూ కన్నీరు మున్నీరయ్యారు. స్పందించిన కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ చేసి సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ అధికారులను కోరారు. విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తూ సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి అంటూ విద్యార్థి విభాగం నాయకులు విద్యార్థి భరత్ కుమార్ తల్లిదండ్రులతో కలిసి న్యాయం కోసం డిమాండ్ చేశారు. విద్యార్థి భరత్ కుమార్ కు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాము దీనికి కారుకులైన వ్యక్తులపై నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో మృతదేహాన్ని అక్కడ నుంచి మార్చురీకి తరలించడం జరిగింది.

## స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి

### నగర కమిషనర్ కే మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 13 ( ప్రభాత వార్త ) :** గుంటూరు నగర పరిశుభ్రతను మెరుగుపడటం, రాబోయే స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రక్రియను మరింత పటిష్టం చేయటం వంటి వాటితో అధికారులు సమైక్యంగా నగర కమిషనర్ కే మయూర్ అశోక్ చూసించారు. కమిషనర్ తన చాంబర్లో శుక్రవారం ప్రజారోగ్య విభాగం సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంజనీరింగ్ విభాగం ఈ ఈ విష్ణు తదితర అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరాన్ని చెత్త రహిత సమాజంగా తీర్చిదిద్దటంలో క్షేత్రస్థాయిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రతి డివిజన్లో నూరు శాతం ఇంటింటికి చెత్త సేకరణ జరిగేలా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. చెత్తతో ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయించి మొక్కలు నాటి గ్రీనరీ పెంచేలా దృష్టి సారించాలన్నారు. వ్యర్థాలు పునర్ వినియోగానిని ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన ఆర్ ఆర్ఆర్ సెంటర్లను తక్షణమే పూర్తిస్థాయిలో ఫంక్షనింగ్ లోకి తీసుకొని రావాలని ఆదేశాలు జారీ చేశారు. చెత్త తరలించే వాహనాలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని, పాడైతే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. వీధి కుక్కలకు ఏబిసిని సోమవారం నుంచి చేయాలని, ఏటుకూరు రోడ్ లోని జిఎంసి యార్డులో పెండింగ్లో ఉన్న పనులు ఈనెల 20వ తేదీ లోపు



పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఆస్తి పన్ను చెల్లింపుకు సెలవు రోజుల్లో కౌంటర్లు ఏర్పాటు...**

నగర ప్రజలు ఆస్తి పన్ను, వాటర్ మీటర్ చార్జీలు, ఖాళీ స్థలాల పనులు చెల్లించేందుకు రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులైనప్పటికీ క్యాష్ కౌంటర్లు పనిచేసేలా ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ తెలిపారు. జిఎంసి ప్రధాన కార్యాలయం తో పాటు, గార్డెన్స్ లోని సర్కిల్ ఆఫీసులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆస్తి పన్ను బకాయిలు కట్టించుకునేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

## రైతు పక్షపాతి మోడీ ప్రభుత్వం

### భాజపా రాష్ట్ర నేత డాక్టర్ ఏలూరి

**అమరావతి, మార్చి 13, ప్రభాతవార్త :** అన్నదాతల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడతను దేశవ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు



సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం అందిస్తూ రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోనే నిధులు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందని తెలిపారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగం పురోగతే దేశాభివృద్ధికి మూలస్తంభమని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తూ రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం రైతు పక్షపాతిగా మారిపోయిందని అన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం వారి వ్యవసాయ అవసరాలకు ఎంతో ఉపయోగపడు తోందని చెప్పారు. దీంతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే దిశగా పలు సంస్కరణలు చేపడుతూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని బిజెపి రాష్ట్ర డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు.



## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**గుంటూరు విద్య, మార్చి 13 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం గుంటూరు పట్టణంలో గల టి.జె.పి.ఎస్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల తీరు ను తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు. పరీక్షా కేంద్రంలో కనీస అవసరాలైన తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనుటకు బస్ సౌకర్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షల సమయంలో చుట్టుప్రక్కల జెరాక్స్ మెషిన్ దుకాణాలు మూసివేయడం అంశాలను గురించి వాకబు చేశారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు జరుగన్నాయి. ఆయా తేదీలలో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. కళాశాలలో చేసిన ఏర్పాట్లను పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ వివరించారు. ఈ సందర్భంగా పలు పరీక్ష గదులను పరిశీలించారు.

## 16 నుండి ఒంటిపూట బడులు

**గుంటూరు విద్య మార్చి 13 ప్రభాతవార్త**

వేసవి తీవ్రత దృష్ట్యా ఈనెల 16వ తేదీ నుండి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటి పూట నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు సోమవారం అనగా 16వ తేదీ నుండి ఉదయం 8 గంటల నుండి 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించాలని, పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటిగంట నుండి 5గంటల వరకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాష తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో తమ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహించిన యెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

**గుంటూరు క్రైమ్, మార్చి13,ప్రభాతవార్త:** కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల – తెలుగు సాహిత్యానికి అక్షయ కీర్తి తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన ప్రముఖ కవయిత్రి మొల్ల. ఆమె 15వ శతాబ్దంలో జీవించి, తెలుగు భాషలో అద్భుతమైన సాహిత్య సంపదను అందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గోపవరము గ్రామంలో జన్మించిన మొల్ల సాధారణ కుటుంబానికి చెందినప్పటికీ తన ప్రతిభతో గొప్ప కవయిత్రిగా ప్రసిద్ధి పొందారు. ఆమె తండ్రి కేసన శివభక్తుడు కాగా, మొల్ల కూడా భక్తి భావంతో సాహిత్య రచనలు చేశారు. మొల్ల రచించిన అత్యంత ప్రసిద్ధ గ్రంథం మొల్ల రామాయణం. ఈ గ్రంథంలో ఆమె రామాయణ కథను ఎంతో సరళమైన, అందమైన తెలుగు భాషలో వర్ణించారు. సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా రామాయణాన్ని అందించడం ఈ గ్రంథం ప్రత్యేకత. క్లిష్టమైన సంస్కృత పదజాలాన్ని తగ్గించి, సహజమైన తెలుగు పదాలతో కథను చెప్పడం ద్వారా ఆమె తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపించారు. తెలుగు సాహిత్యంలో మహిళా కవయిత్రిగా మొల్లకు ప్రత్యేక గౌరవం ఉంది. ఆమె కాలంలో సాహిత్య రంగంలో ఎక్కువగా పురుషులే ఉండగా, మొల్ల తన ప్రతిభతో విశిష్ట స్థానం సంపాదించారు. సాధారణ ప్రజల భాషలో గొప్ప సాహిత్యాన్ని సృష్టించవచ్చుని ఆమె నిరూపించారు అని ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మడు డీఎస్పీ సంకురయ్య, పే సెక్షన్ సూపర్నెంట్ అంజిబాబు ఆర్ముడు రిజర్వ్ ఇన్స్పెక్టర్స్, రామకృష్ణ రెడ్డి, జి.శ్రీహరి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కవయిత్రి మొల్ల తెలుగు భాషాభిమానులకు స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా నిలిచారని, ఆమె రచనలు తెలుగు సాహిత్య సంపదలో చిరస్థాయిగా నిలిచి, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

## జీఎస్‌టి సంస్కరణలతో ఆర్థికాభివృద్ధి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి13, ప్రభాతవార్త:** జీఎస్‌టి 2.0 సంస్కరణలు వ్యవసాయ అభివృద్ధికి, గ్రామీణ అభివృద్ధికి, పారిశ్రామిక అభివృద్ధికి పరోక్షంగా ప్రభావం చూపుతాయని తద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శకంగా దోహదపడతాయని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జీఎస్‌టి 2.0పై నిర్వహించిన



రెండురోజుల జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీఎస్‌టిలో కాలానుగుణంగా మార్పులు అవసరం అన్నారు. అనంతరం పరిశోధనా పత్రాలు సమర్పించిన అధ్యాపకులకు, పరిశోధకులకు సదస్సు డైరెక్టర్, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ సమక్షంలో సర్టిఫికెట్‌లు అందజేశారు.

# వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి చంద్రబాబు చేయూత

## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, మార్చి 13 ప్రభాతవార్త: అన్నదాతల ఉన్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ మూడో విడత నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శిరిగిరిపాడు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో



ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్టాల్స్ ను, ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను, చిరు ధాన్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 38,926 మంది రైతులకు రూ.21 కోట్ల 89 లక్షల 32 వేలు విలువ చేసే నగదు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అనాదిగా మూస ధోరణిలో సాగుతున్న సంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయాలని రైతులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతాంగానికి, వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ, అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, రైతు ఖాతాలో రూ.20 వేల నగదును ఖాతాల్లో జమ చేశారని వివరించారు. ఇచ్చిన మాటకు



కట్టుబడి వ్యవసాయాన్ని పండుగ వాతావరణంలో సాగు చేసేందుకు సీఎం చంద్రబాబు బడ్జెట్లో పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు.

**వరికపూడిసెల నిర్మించకుంటే మా కుటుంబమంతా రాజకీయ సన్యాసమే**

పల్నాడు ప్రజల జీవనాడి వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మించి, ప్రజలకు, రైతులకు అంకితం చేయకుంటే తమ కుటుంబమంతా రాజకీయ సన్యాసం చేస్తామని ఎమ్మెల్యే జూలకంటి తేల్చి చెప్పారు. 2029 నాటికి వరికపూడిసెలను పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలిసి పలుమార్లు సీఎం చంద్రబాబునాయుడిని కలవగా కూటమి ప్రభుత్వంలో వరికపూడిసెల నిర్మించి తీరతామని ఖచ్చితమైన హామీ ఇచ్చారన్నారు. అలానే మరోవైపు గ్రామీణ తాగునీటి అవసరాల కోసం రూ.1200 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా కేటాయించి, ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించామన్నారు. తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి, ఎంపీడీఓ సాంబశివరావు, ఎమ్మార్వో రాజశేఖరనాయక్, వెల్దుర్తి ఏఓ బాలాజీ గంగాధర్, దుర్గి ఏవో అమీర్‌రెడ్డి, కారంపూడి ఏవో నరసింహారావు, మాచర్ల ఏవో పాపకుమారి, మాచర్ల ఏఎంసీ ఛైర్మన్ రాజబోయిన మధుసూదన్ యాదవ్, వైస్ ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్ల రామాంజిరెడ్డి, టీడీపీ నాయకులు వజ్రంనాయక్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**సత్తెనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** సత్తెనపల్లి: మండలం పరిధిలోని ధూళిపాళ్ల గ్రామంలోని వెలుగు ఎంఐఎస్ కార్యాలయంలో రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం



నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారి అమల కుమారి వివోఏలకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, దాని ప్రయోజనాలపై వివరించారు. రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల ఆర్థిక నష్టాలు కలగడమే కాకుండా భూసారం తగ్గిపోవడం, పర్యావరణం కలుషితమవడం, మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలిపారు. ఎంపీడీవో బి. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో టి. సుధారాణి, ప్రాజెక్ట్ మేనేజర్ జె. సమాధానం, ఎంఎస్ సెక్రటరీ ఐ. మారుతి, ఎంఎస్ ట్రెజరర్ బి. అంజమ్మ, సీసీ కే. సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కే. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు 3సి ఫారుల్మా

## రాష్ట్ర ప్రజలకు ద్రోహం తలపెట్టాలనే ఆలోచన

## -విజయభాస్కరరెడ్డి విమర్శ

**సత్తెనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోన పరిశ్రమల స్థాపన అందుకు సంబంధించిన వివరాలు పెట్టుబడులు అందుకు సంబందించిన ఆకర్షణలు ప్రాధాన్యతగా తీసుకుని సిఎం చంద్రబాబు రెండు రోజుల కలెక్టర్ల సమావేశంలో తపనతో త్రిసి ఫార్ములా తలసరి ఆదాయం పెరుగుదలే లక్ష్యంగా మరోసారి అధికారుల సమక్షంలో అబద్ధాలు వల్లెవేశారని వైకాపా స్టేట్ ప్యానలిస్ట్, న్యాయవాది చిట్టా విజయభాస్కరరెడ్డి ఆరోపించారు. 3సి ఫార్ములా అదేదో గొప్ప ఫార్ములాగా ప్రవేశపెట్టాలని అనుకుంటూ యావత్ రాష్ట్ర ప్రజలకు ద్రోహం తలపెట్టాలనే ఆలోచన బలంగా ఉందని స్పష్టమవుతోందన్నారు. సిఎం చెప్పినది కాకుండా ఆయన మనసులో ఉన్న 3సి ఫార్ములా వేరు అని అన్నారు. ఆయన మనసులో ఉన్న మాట చీటింగ్, కరప్షన్, కోఆర్డినేషన్ అని వ్యాఖ్యానించారు. ఏదైనా పరిశ్రమ స్థాపించాలని పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే స్థానిక ఎమ్మెల్యేలు సంబంధిత మంత్రులు, జిల్లా మంత్రులు , స్థానికంగా ఉన్న వారి నాయకత్వం వాటాల రూపంలో వేధిస్తున్న వారిని నియంత్రించలేక సిఎం చంద్రబాబు కలెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేయటం సబబుకాదన్నారు. వైకాపా పాలనలో 2019-24 మధ్య 17 మెడికల్ కాలేజీలు రాష్ట్రానికి రావటం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. విశాఖ తీరంలోన ఆదాని డేటా సెంటర్‌ను తీసుకురావటం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. నేడు సిఎం చంద్రబాబు పదేపదే సంపద సృష్టి అని చెబుతూ, సంపదను లూఠీ చేయటమే 3సిఫార్ములా అని చిట్టా వ్యాఖ్యానించారు.

# ఆరోగ్య కేంద్రంలో బాలికలకు హెచ్‌పివి టీకాలు

**రాజుపాలెం, మార్చి 13 ప్రభాతవార్త:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ నివారణకు 20 మంది బాలికలకు హెచ్.పి.వి. టీకాలు వేసినట్లు



డాక్టర్ రవితేజ నాయక్, డాక్టర్ పాల్ రవి తెలిపారు. ఈ టీకా సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖ క్యాన్సర్) వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం హ్యూమన్ ప్యాపి లోమ వైరస్ (హెచ్పీవీ) టీకాను అందుబాటులోకి తెచ్చింది అని, ఒక సారి టీకా వేయించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ఉంటున్నది అని తెలిపారు. ఆధార్ లేదా జనన ధ్రువీకరణ పత్రంతో టీకా కేంద్రానికి వస్తే టీకా వేస్తారు. ఈ టీకా 2011 మార్చి ఒకటి నుంచి 2012 మార్చి 31వ తేదీలోపు జన్మించిన బాలికలకు టీకాలు వేస్తారు. ప్రతి రోజు రాజుపాలెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజు టీకా కార్యక్రమం జరుగును. ఇప్పటివరకు మండలంలో 55 మంది బాలికలకు టీకాలు వేయటం జరిగిందని అని డాక్టర్ రవితేజ నాయక్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్ రావు, స్టాఫ్ నర్స్ చందన తదితరులు పాల్గొన్నారు

# చిలకలూరిపేట మునిసిపల్ కార్యాలయంలో ఘనంగా మొల్ల జయంతి వేడుక

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో రామాయణ కావ్యాన్ని రచించిన ప్రముఖ కవయిత్రి కుమ్మరి మొల్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రఫాని, కమిషనర్ శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై, మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మొల్ల సేవలు చిరస్మరణీయం: చైర్మన్ రఫాని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రఫాని మాట్లాడుతూ, తెలుగు సాహిత్య చరిత్రలో కుమ్మరి మొల్ల ప్రస్థానం ఎంతో గొప్పదని కొనియాడారు. సామాన్య కుటుంబంలో పుట్టి, పట్టుదలతో రామాయణాన్ని అత్యంత సరళమైన రీతిలో రచించి అందరికీ అర్థమయ్యేలా చేసిన ఘనత ఆమెకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆమె జీవితం నేటి తరానికి



స్ఫూర్తి దాయకమని, సమాజం కోసం ఆమె చేసిన సాహిత్య సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.మున్సిపల్ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ, కవయిత్రి మొల్ల అంకితభావంతో చేసిన కృషి అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు,సిబ్బంది,పట్టణ ప్రముఖులు తది తరులు పాల్గొని మొల్ల చిత్రపటానికి నివాళులు అర్పించారు.

**ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో :**

శుక్రవారం కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి కార్యక్రమం జరిగింది. నిడమానూరు సాంబశివరావు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొని మొల్ల చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు అద్దంకి వర ప్రసాద్ మాట్లాడుతూ మొల్లమాబ కవిత్వం గురించి తెలియజేసారు. సరళమైన తెలుగు రామాయణం రాసిన ఘనత మొల్లకే దక్కిందన్నారు. సుందర కాండలో రావణుని చెరలో వున్న సీతమ్మ ను వర్ణించిన తీరు అమోఘమైనది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షులు కొలకలూరి అంజి, అద్దంకి వరప్రసాద్, నిడమానూరు వెంకట్ ,,అద్దంకి చెంచురామయ్య, నిడుజర్ల గోవిందు, రాజారపు నాగమల్లిఖార్జునరావు, రాజవరపు రాంబాబు, గొట్టం మస్తాన్, , కొండవీటి గోపి, తదితరులున్నారు.

# టిడ్కో సముదాయం వద్ద మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** చిలకలూరిపేట: పట్టణ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఐదు రోజులు ఇఫ్తార్ విందును పూర్తి చేసిన విషయం తెలిసిందే.. గురువారం టిట్కో గృహ సముదాయంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు



(దువా) నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, స్థానిక నాయకులు పాల్గొన్నారు..దగ్గరుండి వడ్డించిన చైర్మన్: దువా అనంతరం మున్సిపల్ చైర్మన్ రఫాని స్వయంగా రంగంలోకి దిగి, ముస్లిం సోదరులకు దగ్గరుండి వంటకాలను వడ్డించారు. అందరితో కలిసి విందులో పాల్గొని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.రంజాన్ మాసం పవిత్రతకు, సోదరభావానికి ప్రతీక పట్టణంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ విందులను ఏర్పాటు చేస్తున్నాం." అని చైర్మన్ రఫాని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం సోదరులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో వైకాపా 16వ ఆవిర్భావ దినోత్సవం

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:**

చిలకలూరిపేట పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి విడదల రజిని, పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీ పెద్దలతో సైతం పోరాడి గెలిచిన ధీశాలి జగన్ అని, ఆయనను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని



పిలుపునిచ్చారు. చంద్రబాబుపై విమర్శనాస్త్రాలు తెలుగుదేశం పార్టీ అధినేతచంద్రబాబు నాయుడుపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "రాష్ట్రంలో చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు ఎవరూ లేరు" అని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం కేవలం జగనన్నతోనే సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టండి: న్యాయవాది మాదాసు

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పరిష్కారాలను కనుగొనుటకు రోడ్డు సేఫ్టీ కమిటీ మీటింగ్ ను ఏర్పాటు చేయాలని అడ్వకేట్ , సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువ శాతం నివారించదగినవేనని కొంత అవగాహన రాహిత్యం, కొంత నిర్లక్ష్యం, అధికారుల మెతక వైఖరి ఈ ప్రమాదాలకు కారణమని అన్నారు. కొందరు ద్విచక్ర వాహనాలకు, కారులకు అధిక వెలుగునిచ్చే ఎల్ఈడీ బల్బులు వాడటం వలన ఎదుటివారికి వాహనాలను గుర్తించడం కష్టతరంగా మారుతుందని అన్నారు. కొందరు మైనర్లు సరైన నైపుణ్యం లేకుండా వాహనాలను నడుపుతున్నారని ఆ కారణం చేత కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అంతేకాకుండా ప్రమాదాలకు కారణం అవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాలు నియంత్రించడం సాధ్యమవుతుందని కనుక రోడ్డు సేఫ్టీ మీటింగ్ ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు.

# మురుగు తొలగించండి సారూ!

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రహదారిపైకి మురుగు చేరి దుర్గంధం భరించలేకపోతున్నామని కారంపూడి పట్టణ ప్రజలు ముక్కులు మూసుకుంటున్నారు. మాచర్ల రోడ్డులోని ఎంఈఓ



కార్యాలయం ఎదురుగా డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైంది. చెత్తాచెదారంతో మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సుమారు 4 అడుగుల మేరకు మురుగు పేరుకుపోయింది. రోడ్ల మీదకు మురుగునీరు చేరి వాహనదారులకు, కాలినడకన వెళ్లే వారికి ఇబ్బందిగా పరిణమించింది. ఈ సమస్యపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మేలుజాతి దూడలతో పశుపోషణ లాభదాయకం

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** మేలుజాతి దూడలతో పశుపోషణ లాభదాయకమని పశువైద్యాధికారులు అన్నారు. మండల పరిధిలోని వేపకంపల్లి గ్రామంలో శుక్రవారం మేలుజాతి లేగదూడల ప్రదర్శన



నిర్వహించారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో అమలులో భాగంగా ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కారంపూడి మండల ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి డాక్టర్ డి.దిలీప్, పిడుగురాళ్ల డాక్టర్ వి.శ్రీనివాసరెడ్డి, మాచవరం డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాడిని కేవలం ఒక ఆదాయ వనరుగా చూడటమే కాకుండా లేగదూడల పోషణను తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి పాడిపోషణ సాధ్యమవుతుందన్నారు. గేదె జాతి పశువుల పునరుత్పత్తి చలికాలం అనుకూలమైనదన్నారు. కార్యక్రమంలో దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 35 మంది రైతులు 42 దూడలను ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న పశుపోషకులకు ప్రోత్సాహక బహుమతులు, మినరల్ మిక్సర్, లివర్ టానిక్‌లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, ఎంపీపీ బోల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు గోళ్ల సురేష్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేకి మోదీ: నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి

**మాచర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** రైతు వ్యతిరేకి మోదీ అని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి అన్నారు. సంవత్సరం క్రితం చేసిన రైతు



వ్యతిరేక చట్టం దాని రద్దు కోసం లక్షల మంది రైతులు డిల్లీలో ఉద్యమం చేపట్టారు. తాజాగా 20 సంవత్సరాలుగా అమలులో ఉన్న ఉపాధిహామీ పథకానికి తూట్లు పొడుస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తూ గ్రామాల్లో వలసలను ప్రోత్సహిస్తూ కొత్త చట్టం తీసుకొచ్చారు. మోడీ-ట్రంప్ వాణిజ్య ఒప్పందం దేశీయ ఎగుమతులను నిరాశపరుస్తున్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధానికి ముందు అమెరికాకు మద్దతు పలకడంతో తీవ్ర వంటగ్యాస్, చమురు, ఎరువుల సంక్షోభం తలెత్తిందన్నారు. ఇన్ని దుర్మార్గాలు చేస్తూ, ఆర్థిక వ్యవస్థను, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను అస్థిరపరుస్తున్న మోదీ పాలన ప్రజలకు శాపంగా మారిందని విమర్శించారు. పార్లమెంటులో ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించకుండా గొంతు నొక్కుతున్నారన్నారు. మోదీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. సమావేశంలో నాయకులు గాదె పుల్లారెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, నాజర్‌వలి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్‌పై వచ్చే వదంతులు నమ్మొద్దు : తహశీల్దారు

**మాచర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** గ్యాస్‌పై వచ్చే వదంతులను నమ్మొద్దని తహశీల్దారు కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాచర్ల మండలంలోని గ్యాస్ ఏజెన్సీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం వల్ల ఎమెర్జెన్సీ దృష్ట్యా గ్యాస్ సప్లయిలో ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో వినియోగదారులకు గ్యాస్ అందేలా చూడాలన్నారు. పాఠశాలలకు, అంగన్‌వాడీ సెంటర్లకు ఎమెర్జెన్సీ సర్వీసులకు గ్యాస్ సకాలంలో అందించాలని గ్యాస్ ఎజెన్సీలకు తెలిపారు.



ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బుక్ చేసుకున్న వారికి సకాలంలో గ్యాస్ అందించాలన్నారు. ఇదే అదునుగా బ్లాక్‌లో గ్యాస్ అమ్మడం, నిల్వలు చేయడం, డెలివరీలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు 08647252999 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సేల్స్ డీటీ బాష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మొల్లమాంబ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకం

## -ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట టౌన్, మార్చి 13,ప్రభాతవార్త:** స్థానిక కుమ్మరిబజార్ లో శుక్రవారం ప్రముఖ కవయిత్రి మెల్లమాంబ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు హాజరై, మాట్లాడారు. అట్టడుగు వర్గం నుంచి వచ్చి, కేవలం తన ప్రతిభతో, దైవభక్తితో రామాయణం వంటి మహా కావ్యాన్ని తెలుగులో రచించిన భక్త శిఖామణి ఆతుకూరి మొల్లమాంబ నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తేటతెలుగులో అందించిన ఆమె కృషి వెలకట్టలేనిదని అన్నారు. మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడే



మహానుబావుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి ఆశయాలను గౌరవించుకుంటున్నామని తెలిపారు. కులమతాలకు అతీతంగా సమాజం కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు టి అంజయ్య,ప్రముఖులు భక్తులు మురళి కూటమి నాయకులు, కుమ్మరి సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో మొల్లమాంబ జయంతి స్థానిక మున్సిపల్ గెస్ట్ హౌస్ లో శుక్రవారం రామాయణ మహా కావ్యాన్ని తెలుగులో అద్భుతంగా రచించిన సుప్రసిద్ధ కవయిత్రి, భక్త శిఖామణి ఆతుకూరి మొల్లమాంబ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరయ్యారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తేటతెలుగులో ఆమె కృషి వెలకట్టలేనిదని అన్నారు. కులమతాలకు అతీతంగా సమాజం కోసం కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యతని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, మార్చి 13 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలోని కుమ్మర బజార్ లో ఏర్పాటు చేసిన తొలి తెలుగు మహిళ రామాయణం కవయిత్రి కుమ్మరి శాలివాహన ముద్దుబిడ్డ మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరావుపేట డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి మహిళలు మొల్లమాంబను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఎన్నో గ్రంథాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో అనువదించటం గొప్ప విషయం అన్నారు. అతి సాధారణ పేద కుటుంబంలో జన్మించి అద్భుతమైన ప్రతిభతో కవయిత్రి మొల్లమాంబ రాణించారని గుర్తు చేశారు. యువత వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట వైసీపీ నాయకులు, కార్యక్రమానిర్వాహకులు టి అంజయ్య, మాజీ ఎంపీపీ మంగమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన జొన్నాదుల

**నరసరావుపేట, మార్చి 13 ప్రభాతవార్త :** స్థానిక ప్రకాష్ నగర్ లోని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నరసరావుపేట గౌరవ అధ్యక్షులు జంజనం వెంకటేశ్వర్లు స్వగృహంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పల్నాడు జిల్లా నూతన



అధ్యక్షులుగా నరసరావుపేటకి చెందిన జొన్నాదుల హనుమత్ ప్రసాద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిదులుగా రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు సర్దార్ జంజనం వెంకట సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 26 న జరుగుతున్న పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు జంజను వెంకటేశ్వర్లు, సెక్రటరీ గుంటి వెంకటేశ్వరావు, కోశాధికారి చిన్నం రామాంజనేయులు, అవార్ రవింత్, గంజి జోగేశ్వరరావు, చ్చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర మల్టీస్పెషల్టి హాస్పిటల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

**నరసరావుపేట టౌన్, మార్చి 13 ప్రభాతవార్త :** నరసరావుపేట పల్నాడు బస్టాండ్ లో ఉన్న శ్రీ రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆర్థోవైద్యులు డాక్టర్ కె.అనిరుద్ ఫణి భార్గవ్ తెలిపారు. వైద్యశాలలో వారు శుక్రవారం మాట్లాడుతూ ఉగాది, శ్రీరామనవమి శుభాకాంక్షలతో ఈనెల 14న శనివారం వైద్యశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం జరుగుతుందన్నారు. రూ. 2500 విలువ కలిగిన బిఎండి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. మోకాళ్ళ నొప్పులు, వెన్నుపూస సమస్యలు, కీళ్లవాతం, యాక్సిడెంట్ కేసులు,కీళ్ల మార్పిడి లకు ఫ్రాక్చర్స్ కు అత్యాధునిక చికిత్స, ఆర్థోస్కోపిక్ సర్జరీలు ఎన్టీఆర్ వైద్య



సేవలో, ఈ.హెచ్. ఎస్ ద్వారా ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. డాక్టర్ డి సత్య కృష్ణ దీపిక మాట్లాడుతూ శనివారం నిర్వహించే వైద్య శిబిరంలో గర్భిణీ స్త్రీలకు అన్ని స్కానింగ్ పరీక్షలపై 50 రాయితీతో స్కానింగ్ చేస్తామన్నారు. ఓ.పి ఉచితంగా చూడడం జరుగుతుందన్నారు. సంతానసాఫల్యం, గర్భిణీలో వచ్చే బీపీ,షుగరు, ఫిడ్స్, రక్తహీనత,ఉమ్మనీరు పెరగటం, తరుగుట,గర్భసంచి సమస్యలు,అండాశయ నీటి తిత్తులు తీసివేయటం, థైరాయిడ్ వైద్య సేవలను అందిస్తున్నట్లు డాక్టర్ సత్య కృష్ణ దీపిక వివరించారు.

# పేకాట స్థావరం పై దాడి పదిమంది అరెస్టు

**నరసరావుపేట క్రైమ్, మార్చి 13 ప్రభాతవార్త :** నరసరావుపేట వన్ టౌన్ పరిధిలో శుక్రవారం రాత్రి సిఐ షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. శ్రీరాంపురం మేడ పైన కొందరు పేకాట స్థావరం నిర్వహిస్తున్నారని సమాచారంతో తమ సిబ్బందితో సిఐ తనిఖీలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న పదిమంది వ్యక్తులు అదుపులోకి తీసుకున్నరు. వారి వద్ద నుండి రూ.23,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాడులు జరుగుతున్నట్లు సిఐ ఫిరోజ్ తెలిపారు. చొట్ట వ్యతిరేకమైన చర్యలు ఎవరు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకుంటామని సి.ఐ ఫిరోజ్ హెచ్చరించారు. వారి వెంట ఎస్సై అరుణ రెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## సత్తెనపల్లిలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

**సత్తెనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ... 16వ శతాబ్దంలో స్త్రీలు, క్రింది కులాల పట్ల సమాజంలో నెలకొన్న వివక్షతను చేదించుకొని మధురమైన పద్యాలతో







మొల్ల రామాయణాన్ని రచించిన మట్టిలో మాణిక్యం మొల్లమాంబ అని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ ) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. మొల్లమాంబ 586 వ జయంతి సందర్భంగా శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి 1వ వార్డు అశోక్ నగర్ లోని విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకల్లో అయన మాట్లాడారు. మొల్లమాంబ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి వెంకటేశ్వర్లు, కె.రాబర్ట్, కంభంపాటి ఆశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో.....**

సత్తెనపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో బిజెపి ఒబిసి మోర్చా అధ్యక్షులు పల్లపు శివయ్య ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ జీవితం నేటి తరం విద్యార్థులకు ఆదర్శమని, ఆమె చూపిన మార్గంలో పయనించాలని కోరారు. కుమ్మరి కుల నాయకులు ,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో బిజెపి ఒబిసి మోర్చా పల్నాడు జిల్లా ఇంఛార్జి మోతే వెంకట శేషగిరిరావు, పట్టణ అధ్యక్షుడు కందకట్ల శంకరరావు, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కట్టా శంకర్రావుతో పాటు గరికపాటి లక్ష్మీ, మేకల యాదగిరి, కుమ్మరి దస్తగిరి, మర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

**టిడిపి ఆధ్వర్యంలో 1వవార్డు అశోకనగర్‌లో...**

తొలి తెలుగు మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 586 వ జయంతి సందర్భంగా స్థానిక 1వ వార్డు అశోక్ నగర్ లో తెలుగుదేశం పార్టీ వార్డు ఇంచార్జ్ మద్దిగుంట బాలకోటయ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి . పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యెల్లినేడి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు మస్తాన్ వలీ ,కార్యదర్శి జానిబాబు,బీజేపీ నాయకులు శంకర్ రావు, అరేపల్లి ఏడుకొండలు, కట్టా శివ దుర్గారావు,ఆకుల హనుమతరావు సెగ్గెం వెంకటేశ్వర్లు, మూసిని బాబు శాత్రశుపల్లి మాణిక్యాలరావు,పిలా సాంబశివరావు గారు,దరిపల్లి రామకోటయ్య ,పాలడుగు వెంకటేశ్వరావు, తోర్లికొండ రాంగోపాల్,గుంటూరు ఆశీర్వాదం, మొక్కపాటి సుధాకర్, కర్నాటి మురళీ, మారెళ్ల మల్లేశ్వర రావు, మారెళ్ల స్వామీ, అబ్బూరి సత్యనారాయణ, వజ్జ వెంకటేశ్వరరావు, మద్దిగుంట గోపీ చంద్ తదితరులు పాల్గొన్నారు

**వైఎస్సార్సీపి కార్యాలయంలో......**

మొల్లమాంబ జయంతి వేడుకలను సత్తెనపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొన్నారు. సత్తెనపల్లి 1వ వార్డులో కౌన్సిలర్ వరికళ్ళు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి రైల్వే గేటు వద్ద బిసి సంఘ నాయకుల ఆధ్వర్యంలో...**

కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బీసి సంఘ నాయకులు మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ వాల్మీకి రామాయణాన్ని తెలుగులో సులభతరం చేసి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రామాయణాన్ని మహా పండితులు అనేకమంది రచించినప్పటికీ మొల్ల రామాయణానికి విశిష్ట స్థానం దక్కిందన్నారు.బీసీ సంఘ నాయకులు గొట్టం వెంకటేష్, మద్దికుంట్ల జగదీష్, చింకా అంకమ్మరావు, కుమ్మరి దస్తగిరి, పిక్కిలి శివ,గుంటూరు గోవిందు, షేక్ చిన్న షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన
# జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**నరసరావుపేట,మార్చి 13 ప్రభాతవార్త :** వైద్య సేవల కోసం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని అంకిత భావంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం లింగంగుంట్ల ఏరియా ఆసుపత్రిని




ఆకస్మిక తనిఖీ చేశారు.ఆసుపత్రి లోని క్రిటికల్ కేర్ బ్లాక్, ఐసీయు, రక్త నిధి కేంద్రం, ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులతో, సహాయకులతో మాట్లాడారు. వ్యాధిగ్రస్తులకు, ఒక సహాయకుడికి భోజనం తప్పనిసరిగా అందించాలన్నారు. ఏరియా ఆసుపత్రి విస్తరణకు సంబంధించిన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాల అనంతరం ఏరియా ఆసుపత్రిలో 200 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వంట గ్యాస్ సిలండర్ల బ్లాక్ మార్కెటింగ్ పై కఠిన చర్యలు...** జిల్లాలో ఎల్పిజీ సిలిండర్ల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను ఆసరాగా తీసుకొని ఎల్పిజీ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి వినియోగదారునికి అవసరమైన గ్యాస్ సిలిండర్ అందేలా జిల్లా యంత్రాంగం, ఆయిల్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నా యన్నారు. జిల్లాలో పని చేస్తున్న ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వినియోగదారులకు నిరంతరంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాయని డెలివరీ వ్యవస్థ ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో ఎల్పీజీ సరఫరా నిలిచిందని, కొరత అంటూ వస్తున్న అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని అధికారిక ప్రచారం మాత్రమే నమ్మాలని అన్నారు.వదంతుల ప్రభావంతో పెద్ద ఎత్తున రీఫిల్ బుక్ చేయడంతో బుకింగ్,సరఫరాలో స్వల్ప ఆటంకం కలిగిందన్నారు.

## మాచర్ల తిరునాళ్ల మహోత్సవాలు
## దైవ చింతనతో జరగాలి : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**మాచర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** పల్నాటి ప్రజల ఆరాధ్యదైవం, స్థానికంగా కొలువుదీరిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు దైవ చింతనతో సాగాలని అధికారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఆలయ కల్యాణ మండపంలో ఈ నెల 31నుంచి ప్రారంభమయ్యే తిరునాళ్ల మహోత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వామివారి కల్యాణం, రథోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. మున్సిపల్, పోలీసు, విద్యుత్తు, ఫైర్, హెల్త్ శాఖలు సమన్వయంతో పనిచేసి తిరునాళ్లను విజయవంతం చేయాలన్నారు. ఘన చరిత్ర ఉన్న మాచర్ల తిరునాళ్లకు మరింత కీర్తి తీసుకువచ్చేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో తిరునాళ్ల జరిగేలా చూడాలన్నారు. రాజకీయ దురుద్దేశాలకు



పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ వెంకటరమణ, తహశీల్దారు కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, పట్టణ సీఐ వెంకటరమణ, ఆలయ ఈఓ సైదయ్య, మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొమెర అనంతరాములు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈఓ రవికుమార్

**కారంపూడి, మార్చి 13 ప్రభాతవార్త:** ఈ నెల 16 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రవికుమార్ అన్నారు. శుక్రవారం కారంపూడిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలం మొత్తం 654 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 100 మీటర్ల వరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ షాపులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మెడికల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.



## శ్రీధర్ మృతికి ఎమ్మెల్సీ 'మర్రి' సంతాపం

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెంకు చెందిన కేతినేని సుబ్బారావు కుమారుడు కేతినేని శ్రీధర్ బెంగళూరులో నివసిస్తున్నారు. గత బుధవారం పసుమర్రు కొత్త హైవే దగ్గర జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ , సోమేపల్లి వెంకటసుబ్బయ్య నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారివెంట ఈవూరి బ్రహ్మానందం , జాలాది సుబ్బారావు , మన్నవ మాణిక్యాల రావు,గడిపుడి దశరథ రామయ్య ,మల్లేశ్వరరావు తదితరులున్నారు.

# రైతు పక్షపాతిగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట,మార్చి 13 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న



తిదీళీతీ శిలీ కిసాన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని రైతు కుటుంబాలకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరిందని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ పథకం సభలో ఆయన, రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కలిసి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని మొత్తం 20,463 లబ్ధిదారుల కుటుంబాలకు మూడు విడతల్లో కలిపి మొత్తం రూ. 39.4732 కోట్ల నిధులు విడుదలయ్యాయని ఆయన వివరించారు. మండలాల వారీగా వివరాలను వెల్లడిస్తూ, నరసరావుపేట మండలంలో 10,405 రైతు కుటుంబాలకు గాను రూ. 20.1612 కోట్లు, మరియు రొంపిచర్ల మండలంలో 10,058 రైతు కుటుంబాలకు గాను రూ. 19.312 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విడతల వారీగా చూస్తే, నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో రూ. 14.3 కోట్లు, రెండో విడతలో రూ. 13.3 కోట్లు, మరియు మూడో విడతలో రూ. 11.8732 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయి. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందన్నారు.ఈ నిధులు వ్యవసాయ పెట్టుబడులకు మరియు రైతు కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. సాగు పనుల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు మరియు రాష్ట్ర గ్రంధాలయ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు, మండల పార్టీ ప్రెసిడెంట్స్,అగ్రికల్చర్ నాచురల్ ఫామింగ్ పి డి అమల కుమారి,అధికారులు,మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు, ఉమ్మడి కూటమి నేతలు ,,రైతు సంఘ నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

## కిడ్నీల పట్ల అప్రమత్తత అవసరం
### -ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ మార్చి 13 ప్రభాతవార్త :** ఖీప్రపంచ కిడ్నీ దినోత్సవంఖీ పురస్కరించుకుని వినుకొండ పట్టణంలోని సురేష్ కిడ్నీ హస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల,ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**పెదకూరపాడు, మార్చి 13 ,ప్రభాతవార్త:** పట్టుదల,ఆత్మవిశ్వాసం ఉంటే పదవ తరగతి విద్యార్థులు ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పరీక్షలపై భయం విడనాడాలని పెదకూరపాడు ఇన్చార్జి ఎంపీడీవో కాకుమాను శరత్ బాబు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండలములోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల సామిత్ చౌదరి




సహకారంతో పరీక్ష ప్యాడ్లు,పెన్నులు,పెన్సిల్, పౌచ్,రబ్బర్,ఎరైజర్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలన్నారు.విలేజ్ రెవెన్యూ అధికారులు షేక్ జాన్ సైదా, రాయవరపు శ్రీలక్ష్మిలు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో ప్రతిభ చూపి తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ మాట్లాడుతూ పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మేడా రాధాకృష్ణ,మర్రెడ్డి,కుంభా కోటేశ్వరరావు,కాత్యాయిని, సత్యవతి తదితరులు ఉన్నారు.

# రామాయణ కావ్య రసధుని కవయిత్రి మొల్ల
### - ఏపీ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు,జీడీసీసీ బ్యాంకు ఛైర్మెన్ మక్కెన

**వినుకొండ మార్చి 13 ప్రభాతవార్త :** రామాయణం మానవాళికి లభించిన పరమ పవిత్ర కావ్యమని అటువంటి పరమ పవిత్ర కావ్యమును తెలుగు ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగులో



సరళీకృతంగా రామాయణాన్ని రచించిన మహా కవయిత్రి మొల్లమాంబ అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు.. మహాకవిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని చీఫ్ విప్ కార్యాలయంలో 586 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 15 వ దశాబ్దంలో మహిళలంటే చిన్నచూపు మహిళలకు చదువుతో పనిలేదు అనుకునే ఆనాటి కాలంలో మహిళగా తాను పొందిన విజ్ఞానాన్ని తన వద్దనే దాచుకోకుండా తన రచనలతో లోకానికి చాటి చెప్పిన మహా కవయిత్రి మొల్లమాంబ అని అన్నారు. అటువంటి గొప్ప ధీరవనిత, మహా జ్ఞాని, జయంతిని గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర పండుగగా గుర్తించడం చాలా అభినందనీయమన్నారు. నిరుపేద కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ తన రచనలతో సమాజంలోని అంటరానితనాన్ని, వివక్షతను రూపుమాపిందన్నారు .ఇప్పటికే మొల్లమాంబ యొక్క ఖ్యాతిని గుర్తించిన ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు హైదరాబాద్ ట్యాంక్ బండ్ మీద ఆమె విగ్రహాన్ని ప్రతిష్టించారని తెలిపారు. ఈనాటి మన చంద్రన్న ఆమె జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించడం హర్షనీయమన్నారు.అలాగే మొల్లమాంబ పేరిట కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ సైతం విడుదల చేసిందని పాఠ్యాంశాలలో సైతం మొల్లమాంబ చరిత్రను విద్యార్థులకు బోధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ పట్టణ టీడీపీ అధ్యక్షులు బొంకూరి రోశయ్య. పారెళ్ల మల్లికార్జునరావు, పల్నాడు జిల్లా శాలివాహన సంఘం గౌరవ అధ్యక్షులు పారెళ్ల రమేష్, పత్తేపురం గాలయ్య, డైరెక్టర్ పిడతల నేమలయ్య, పారేళ్ళ సుబ్రహ్మణ్యం, సంగెపు వెంకటేశ్వర్లు, పారెళ్ళ లక్ష్మయ్య, జీడిమల్ల మోహన్, పారెళ్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ
## కార్యక్రమంలో పాల్గొన్న జీవీ

**వినుకొండ మార్చి 13 ప్రభాతవార్త :** వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్లలో నిర్వహించిన ఖీఅన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌ఖీ మూడో విడత కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని పథకం ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. వినుకొండ నియోజకవర్గం 45,898 మంది రైతులకు కాను రూ. 25,62,44,000 లు రైతుల ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వం జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం చెక్కును చీఫ్ విప్ జీవీ రైతులకు అందజేశారు. తొలిత నూజెండ్ల గ్రామంలో నిమ్మ తోటను సందర్శించి, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు , అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు
### -ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

**క్రోసూరు,మార్చి 13, ప్రభాతవార్త** వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత వేడి గాలులు కారణంగా వడదెబ్బ (సన్ స్ట్రోక్) , డీ హైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు అని, సరి అయిన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతక పరిస్థితులు సంభవిస్తాయని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు శుక్రవారం ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు గూర్చి ఆయన ప్రజలకు వివరించారు గొడుగు వాడటం, తెలుపు రంగు పలుచటి చేనేత ధరించాలి అని పేర్కొన్నారు తలకు టోపీ లేదా రుమాలు వాడాలని, వేడిగాలులు తగలకుండా చూసుకోవాలని తెలియజేశారు శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడుతుందన్నారు ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు త్రాగాలని తెలియజేశారు వీలైనన్ని ఎక్కువసార్లు మంచినీరు త్రాగాలన్నారు ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, చల్లని మంచినీరు త్రాగటం మంచిదన్నారు వడదెబ్బ తగిలిన వెంటనే తీసుకోవలసిన ప్రథమ చికిత వివరాలు గూర్చి ఆయన వివరించారు వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు అలాగే చేస్తూ ఉండాలని అన్నారు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణము (ఓ. ఆర్ . ఎస్) త్రాగించాలి అని అన్నారు వడదెబ్బ తగిలి అపస్మార్క స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదు వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చాలని శాంసన్ తెలిపారు చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింపు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మార్క స్థితికి వెళ్లడం అన్నారు వడదెబ్బకు ఎక్కువగా 65 ఏళ్ల వయసు పైబడిన వారు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పసి పిల్లలు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు ఉన్నవారు వడదెబ్బకు ఎక్కువగా గురి అవుతారని శాంసన్ ఈ సందర్భంగా తెలియజేశారు

## విద్యార్థుల అభ్యున్నతి, ఉద్యోగ కల్పనకు అవకాశాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** కొండ్రుపాడు లోని కిట్స్ అక్షర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2 రోజుల గాలస్ యూత్ ఫెస్ట్ కు ముఖ్య అతిథిగా పేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యతోనే ఉన్నత స్థానం సాధించగలుగుతారు అని ప్రత్తిపాటి అన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల అభ్యున్నతికి వారి ఉద్యోగ కల్పనలు ఎన్నో అవకాశాలు తెస్తుందని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలని ఈగల్ టీంలు పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో చేస్తున్నారన్నారు. ఐ.ఏ.ఎస్, ఐపీఎస్, ఐటీ, టెక్నాలజీ రంగాలలో ముందుకు వెళ్లే విధాగం ఉండాలని సోషల్




మీడియాకు దూరంగా ఉండటం చాలా ఉత్తమం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అకే రవికుమార్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కళాశాల ఛైర్మన్ సుబ్బారావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, కళాశాల డైరెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నవర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో
## పాఠశాలకు స్పీకర్, మైక్ బహూకరణ

**చిలకలూరిపేట, మార్చి 13, ప్రభాతవార్త:** ఇన్నర్ వీల్ క్లబ్ అఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శుక్రవారం గణపవరంలోని ఎంపీపీస్ స్కూల్ కు స్పీకర్, మైక్ ను ఇన్నర్



వీల్ సభ్యులు కందిమళ్ళ భారతి, మండవ పద్మావతి బహుకరించారు. అనంతరం వారిద్దరినీ స్కూల్ హెడమాస్టర్ సుభాషిణి, టీచర్స్ సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ నార్నె జయలక్ష్మి, మెంబర్స్ కందిమళ్ళ భారతి, మండవ పద్మావతి, రొటేరియన్ మండవ లక్ష్మీనారాయణ , హెచ్ఎం సుభాషిణి , టీచర్స్ పాల్గొన్నారు.

## వ్యాపారస్తులపై హిజ్రాల బరితెగింపు

**గురజాల, మార్చి 12 ప్రభాతవార్త :** గురజాల పట్టణంలో కొందరు హిజ్రాల బరితెగింపు ఎక్కువైంది. ప్రతి రోజూ దుకాణాల వద్దకు వచ్చి ఇచ్చింది తీసుకోకుండా అదనంగా డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బెదిరింపులకు దిగుతున్నారు. వీరు ఎక్కువగా నియోజకవర్గంలోని నడికుడి రైల్వే జంక్షన్ కేంద్రంగా హిజ్రాలు జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి బెడదతో వ్యాపారులు, సామాన్య ప్రజలు హడలిపోతున్నారు. నిత్యం ఆటోలో ప్రయాణిస్తూ ప్రతి ఊరికి వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు. శుభకార్యాలు, వివాహాల వద్ద వీరి బెడద అధికంగా ఉంటుంది. అడిగినంత ఇవ్వకుంటే అల్లరి చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారు. వీరు బ్యాచ్‌ల వారీగా సంచరిస్తున్నారు. తాజాగా గురజాలలో హిజ్రాల బెడద మరింత ఎక్కువైంది. వ్యాపార దుకాణాల్లో ప్రవేశించి మహిళలు, పిల్లలు ఉన్నప్పటికీ డబ్బులు ఇవ్వకుండా హంగామా చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో వ్యాపారులు హడలిపోతున్నారు. పోలీసు శాఖ అధికారులు దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.



## ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

**మాచర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్య కవయిత్రి మొల్ల జయంతి వేడుకల సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో మొల్ల విశిష్టస్థానం సంపాదించుకున్నారన్నారు. సామాన్యులకు అర్థమయ్యే సరళమైన తెలుగుభాషలో మొల్ల రామాయణం రచించారన్నారు. మహిళలు కూడా మొల్లను ఆదర్శంగా తీసుకొని సాహిత్య రంగంలో తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**నిజాంపట్నం, మార్చి 13, ప్రభాతవార్త:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రేపల్లె డిఎస్‌పి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని అడవులదీవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్షత్రనగర్‌లో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది పోలీస్ సిబ్బంది, 5 గురు ఎస్‌ఐలు బృందాలుగా గ్రామంలోని 150 ఇళ్ళను తనిఖీ చేశారు. ఎక్కడైనా గంజాయి, నాటుసారా వంటి మత్తుపదార్థాలు లభిస్తాయేమోనని ముమ్మర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, నాటుసారా, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు విక్రయిస్తే, రవాణా చేస్తే, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలులేని 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు.



# బాపట్ల జిల్లా వార్త



## విశ్రాంత ఉపాధ్యాయుడు జనార్ధనరావు మృతి

**నిజాంపట్నం, మార్చి 13, ప్రభాతవార్త:** విశ్రాంత ఉపాధ్యాయుడు జనార్ధనరావు మృతి బాధాకరమని జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో నివశిస్తున్న జనార్ధనరావు మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాలలువేసి కూటమి నాయకులు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, తెదెపా నాయకుడు ఖాదర్ బాబు, ఇమ్రాన్‌ఖాన్‌లు నివాళులర్పించారు. జనార్ధనరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.



## అన్నదాత కళ్లలో ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పిట్లలవానిపాలెం. మార్చి13, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోదీ దార్శనికత, రాష్ట్రంలో చంద్రబాబు అనుభవం కలిసిన డబుల్ ఇంజన్ పాలనతోనే రైతులకు స్వర్ణయుగం సాధ్యమవుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



రాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పిట్లలవానిపాలెం మండలం ఖాజీపాలెంలో నిర్వహించిన పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు.. జిల్లా జాయింట్ కలెక్టర్ భావనతో కలిసి ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**నేరుగా రైతుల ఖాతాల్లోకే నిధులు**

ముందుగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో నిర్వహించిన లైవ్ కార్యక్రమాన్ని రైతులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. అనంతరం నియోజకవర్గంలోని 18,385 మంది రైతులకు సంబంధించి రూ. 10.32 కోట్ల భారీ చెక్కును జేసీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పడిన ఇబ్బందులను గుర్తు చేస్తూ, ఇప్పుడు పైసా అవినీతి లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు చేరుతోందన్నారు. సభకు చేరుకునే ముందు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ నేరుగా పొలాల్లోకి వెళ్లారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా సాగు పనుల్లో ఉన్న రైతులతో మమేకమయ్యారు. వారి సమస్యలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సౌకర్యం నుంచి గిట్టుబాటు ధర వరకు అన్ని విషయాల్లో కూటమి ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. పీఎం కిసాన్‌కు తోడుగా 'అన్నదాత సుఖీభవ' ద్వారా అదనపు సాయం అందించడం దేశంలోనే గొప్ప సంస్కరణ అని అన్నారు.

**బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 18,385 మంది రైతులకు లబ్ధి.**

పాల్గొన్న ప్రముఖులు: మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ ఏపూరి భూపతి రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు కూటమి నాయకులు. తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**భట్టి ప్రోలు(రేపల్లె), మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా ప్రణాళికాబద్ధంగా పాలన అందిస్తున్నదని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు స్పష్టం చేశారు.శుక్రవారం భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షతవహించారు.ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నట్లు చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం గతంలో ప్రజల వద్దకు పాలన,జన్మభూమి వంటి కార్యక్రమాలను నిర్వహించిన విషయం ఆయన గుర్తు చేశారు.అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణకుమారి,భట్టిప్రోలు పిఎసిఎస్ ఛైర్మన్ పరుచూరి రమేష్,జడ్పీటిసి తిరువీధుల ఉదయభాస్కరి,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు,వై.కరుణశ్రీనివాసరావు,వాకా శేషుబాబు,తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు,ఎంపిడివో ఎస్.వెంకటరమణ,డిప్యూటీ తహశీల్దార్ అనగాని శాంతలక్ష్మి,ఎపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## సామాన్యుల రామాయణం.. మొల్లమ్మ కావ్యం!

**బాపట్ల, మార్చి 13 ప్రభాతవార్త:** తెలుగు సాహితీ వనంలో సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించి, అసామాన్య కీర్తిని గడించిన ధీర వనిత, భక్త కవయిత్రి ఆతుకూరి మొల్లమ్మ అని బాపట్ల జిల్లా సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ కొనియాడారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మొల్లమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డిఎస్పి జగదీష్ నాయక్ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో మహిళలకు విద్య, సాహిత్యం అందని ద్రాక్షగా ఉన్న రోజుల్లోనే, మొల్లమ్మ తన కవితా శక్తితో అద్భుతాలు సృష్టించారన్నారు.ఉమ్మడి కడప జిల్లా గోపవరంలో జన్మించిన ఆమె, శ్రీకృష్ణదేవరాయల వంటి మహారాజుల ఆస్థానంలోనే ప్రశంసలు పొందడం ఆమె పట్టుదలకు నిదర్శనమన్నారు.సరళ సుందర ఖిమొల్ల రామాయణంఖిమొల్లమ్మ రచించిన 'మొల్ల రామాయణం' తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. సంస్కృత భూయిష్టమైన పదాలు కాకుండా, సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా అత్యంత సరళమైన పదాలతో, రమణీయ మైన శైలిలో ఆమె రామాయణాన్ని రచించారని పేర్కొన్నారు. అకుంఠిత దీక్ష ఉంటే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించి విజయం సాధించ వచ్చని నిరూపించిన మొల్లమ్మ జీవితం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్.ఐ. షేక్ మోలుద్దీన్ తో పాటు పలువురు పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** ప్రజాదర్బార్‌లో దాఖలైన ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ చెప్పారు.శుక్రవారం రేపల్లె తెదేపా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమ్మూరు వెంకటేష్,ఎస్.సూర్యరాజు,ఎం.సుబ్బారావు,వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఎన్.వి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## సాంబశివరావు సేవలు చిరస్మరణీయం

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** నగరం మండలంలోని కారంకివారిపాలెం పంచాయతీ సర్పంచ్‌గా 10 సంవత్సరాలు అభివృద్ధికి కృషి చేసిన పీటా సాంబశివరావు మృతి తీరని లోటని,ఆయన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు.శుక్రవారం రేపల్లె పురపాలక సంఘంలోని 9వ వార్డులో సాంబశివ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి సాంబ శివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ సాంబశివరావు తండ్రి వెంకటస్వామి కూడా 1950 సంవత్సరం నుండి 5 పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారన్నారు.రాజకీయ కుటుంబంగా కొనసాగడం అభినందనీయమన్నారు.పదేళ్ళు ధూళిపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా సాంబశివరావు సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు.మాజీ మంత్రి అనగాని భగవంతరావు,ఈవూరి సుబ్బారావు,మాజీ మంత్రి ఈవూరి సీతారామమ్మల అడుగుజాడల్లో సాంబశివరావు ప్రజా సేవకు అంకితమయ్యారని కేసన శంకరరావు చెప్పారు.సాంబశివరావు తండ్రి వెంకటస్వామి అయితే స్వర్గీయ గౌతు లచ్చన్న,ఎన్జీరంగా ,అనగాని భగవంతరావు,మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిల ప్రియ శిష్యునిగా కొనసాగారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు దాసరి అమరనాథ్,కె.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వానికి ప్రతిరూపం డాక్టర్ పృధ్వీగణేష్

రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:కష్టాలలో ఉన్న వారి బాధను అర్థం చేసుకుని నిజమైన మానవత్వాన్ని ప్రదర్శించిన రేపల్లెలోని 30 పడకల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృధ్వీ గణేష్ శుక్రవారం బాధిత కుటుంబంలో





చెరగని ముద్ర వేసుకున్నారు.రేపల్లె మండలంలోని చిన అరవపల్లి గ్రామానికి చెందిన టి.సూర్య(30) ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందేందుకు కుటుంబ సభ్యులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు.వైద్య పరీక్షలు చేయించారు. అప్పటికే సూర్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచాడు. మృతునికి భార్య,ముగ్గురు పిల్లలు ఉన్నారు.సూర్య కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదు.కాల్వ కట్టపై నివాసం ఉంటున్నారు.కడు పేద కుటుంబం.మృత దేహాన్ని ఇంటికి తీసుకువెళ్ళేందుకు ఆ కుటుంబ సభ్యుల వద్ద డబ్బు సమస్య ఏర్పడింది.దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్న కుటుంబాన్ని డాక్టర్ పృధ్వీ గణేష్ గమనించారు.ఆర్థిక పరమైన సమస్య తెలుసుకుని చలించిపోయారు.ఆపదలో ఉన్న వారికి నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యం గుర్తుకు వచ్చింది.వెంటనే మృత దేహాన్ని తరలించడానికి అవసరమైన అంబులెన్స్ వాహనాన్ని సమకూర్చి డాక్టర్ పృధ్వీ గణేష్ తన నైతిక విలువను చాటుకున్నారు.ఖననం కార్యక్రమానికి డబ్బులేవు.దీంతో స్పందించిన ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులు జి.చక్రధర రావు,యల్లయ్య,ఎంఎన్‌వో గోపి,సారంగపాణి, పులి వెంకటేశ్వరరావు తదితరులు సూర్య ఖననం కార్యక్రమానికి అవసరమైన రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.అంత బాధలో ఉండి కూడా మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతాభావంతో అక్కడి నుండి అంబులెన్స్‌లో వెళ్ళిపోయారు.

## భావితరాలకు మొల్లమాంబ చరిత్రను అందించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగధర్ గౌడ్

**బాపట్ల, మార్చి 13, ప్రభాతవార్త:** మహిళలు సాహిత్య రంగంలో అద్భుత శిఖరాలను అధిరోహించగలరని కవయిత్రి మొల్లమాంబ తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జి.గంగధర్





గౌడ్ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి డీఆర్వోతో పాటు బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం డీఆర్వో మాట్లాడుతూ కడప జిల్లా గోపవరం మండలంలో జన్మించిన మొల్లమాంబ, తెలుగు సాహిత్యంలో ధ్రువతారగా నిలిచారన్నారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సరళమైన తెలుగులో ఆమె రాసిన ఖిమొల్ల రామాయణంఖి సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. నాటి కాలంలోనే ఒక మహిళగా సాహిత్య రంగంలో ఆమె సాధించిన విజయం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు భాషా వికాసానికి ఆమె చేసిన సేవలు అమూల్యమని, అటువంటి గొప్ప కవయిత్రి చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ, శాలివాహన సంఘాల నాయకులు మొల్లమాంబ జీవిత విశేషాలను కొనియాడారు. ఇదే తరుణంలో, బాపట్ల జిల్లా కేంద్రంలో మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ డీఆర్వోకు వినతిపత్రం అందజేశారుఈ వేడుకల్లో బీసీ సంక్షేమ శాఖ డీడీ శివనాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు, కలెక్టరేట్ సిబ్బందితో పాటు బీసీ, శాలివాహన సంఘాల ప్రతినిధులు, సాహిత్య ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గం

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్-సిఐటియు) నూతన కార్యవర్గం 9 మందితో ఏర్పడింది.ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షునిగా ఎ.సత్యనారాయణ(రేపల్లె డిపో),ప్రధాన కార్యదర్శిగా బి.తిరుమలరెడ్డి(బాపట్ల డిపో),కోశాధికారిగా బి.శ్రీనివాస్(చీరాల డిపో),గౌరవాధ్యక్షునిగా జి.సత్యనారాయణ,సహాయ కార్యదర్శులు,ఉపాధ్యక్షులుగా బి.బేబిరాణి,డి.మురళి, రాజబాబు, మల్లికార్జునరావు,ఎస్.యోగానంద్,తులసిరావులు ఎన్నికయ్యారు.ఎన్నికల కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.అయ్యప్పరెడ్డి,బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎం.కుమార్,కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి,సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.మణిలాల్,రేపల్లె డిపో కార్యదర్శి ఎన్.వి.సాగర్,అధ్యక్షుడు బి.సురేష్,హైర్ బస్ యూనియన్ రేపల్లెశాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు,నాయకులు నాంచారయ్య, శివప్రసాద్,కె.శ్రీను,ఆయా డిపోలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదాల విషయంలో ప్రాణ,ఆస్తినష్టం వాటిల్లని విధంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వరించాలని రేపల్లె ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు



చెప్పారు.శుక్రవారం మండలంలోని పెనుమూడిలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.వినయ్ ఆదేశానుసారం బేసిక్ స్విమ్మింగ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు.శిక్షణా తరగతులను శిక్షకుడు బొలగాని శ్రీనివాసరావు నిర్వహించారు.నీటిలో ప్రమాదాలకు గురైన వారిని ఏ విధంగా రక్షించాలో నేర్పారు.వరదల సమయంలో స్పందించాల్సిన మెళకువలను తెలియజేశారు.స్విమ్మింగ్ నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు అవసరమైన శిక్షణనిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగేంద్రరెడ్డి,సుబ్బారావు,రాజేష్, జనార్ధన్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## అపోహలు వీడి శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

### బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు పి. ప్రసూన రాణి

**బాపట్ల. మార్చి 13, ప్రభాతవార్త:** రైతులు తాము సాగు చేసే నేల స్వభావంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, భూసార రక్షణ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు పి. ప్రసూన రాణి సూచించారు. ఐ.సి.ఏ.ఆర్. ఎస్.సి. సబ్ ప్లాన్ సహకారంతో, కళాశాల మృత్తికా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూలపాలెం గ్రామ రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో ఎదురయ్యే సందేహాల నివారణకు రైతులు నేరుగా బాపట్ల వ్యవసాయ కళాశాల మృత్తికా విభాగాన్ని సంప్రదించి, శాస్త్రవేత్తల ద్వారా తగిన సూచనలు పొందవచ్చునన్నారు.పంట సంరక్షణలో వానపాముల ప్రాధాన్యతను డా. ప్రసూన రాణి రైతులకు వివరించారు. వానపాముల ఎంపిక, బెడ్స్ తయారీ విధానం మరియు వాటి ద్వారా లభించే ఎరువులు పంట ఉత్పాదకతను ఎలా పెంచుతాయో క్షుణ్ణంగా తెలియజేశారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి రైతు తమ పొలం మట్టిని పరీక్షించుకోవాలన్నారు.

మృత్తికా విభాగాధిపతి డాక్టరు ఎం. లత మాట్లాడుతూ, నేలలో తేమను కాపాడుకోవడంతో పాటు సేంద్రియ వ్యర్థాలను వృథా చేయకుండా ఎరువుగా మార్చుకోవాలన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడడంలో జీవ ఎరువుల పాత్ర కీలకమన్నారు.ఈ కార్యక్రమంలో పీజీ మరియు పీహెచ్‌డీ విద్యార్థులు రైతులకు పలు ఆసక్తికర ప్రదర్శనలు ఇచ్చారు. భూసార పరీక్ష కోసం శాస్త్రీయ పద్ధతిలో మట్టిని ఎలా సేకరించాలో చేసి చూపారు.నేలలోని పోషకాలను గుర్తించడం, అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వాడే విధానంపై అవగాహన కల్పించారు.అనంతరం రైతులకు ఉచితంగా వర్మీకంపోస్టు మరియు రైజోబియం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టరు ఏ.జె. సువర్ణలత, డా. పి. మోహన్ రావు, డా. పి. అంజిబాబు, ఎం. స్వప్న, కె. నాన్సీ, డా. బి. అపర్ణతో పాటు సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు





## శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవాసమితి వారిచే అనాథ శవానికి అంత్యక్రియలు

**తెనాలి టౌన్ మార్చి13(ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో మృతి చెందిన యువకునికి అంత్యక్రియలు నిర్వహించిన పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి సభ్యులు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం, పశ్చిమ బెంగాల్ కు చెందిన బింద్ నాయక్ (39)అనే వ్యక్తి చెన్నై ట్రైన్ లో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు కటవరం గ్రామ సమీపాన రైలు నుండి జారి పడి మరణించాడు అన్న మరణించగా రైల్వే పోలీసులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అతని మృతదేహాన్ని భద్రపరచగా భద్రపరిచారు.మృతునికి సంబంధించిన అతని సోదరుడు,బంధువులు, మృతదేహన్ని స్వస్థలానికి తీసుకెళ్లటానికి నిస్సహాయత వ్యక్తం చేయటంతో,రైల్వే పోలీసుల సూచనతో,శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృందం అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో,బుర్రిపాలెం రోడ్డు లోని మహాప్రస్థానంలో సేవాసమితి సభ్యుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్లెల వాసు, పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



## నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** అన్నా క్యాంటిన్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రేపల్లె మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు ఆదేశించారు.శుక్రవారం రేపల్లె పట్టణంలోని అన్నా క్యాంటిన్‌ను తనిఖీ చేశారు.ఆహార నాణ్యత,పరిశుభ్రతను పరిశీలించారు.సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.క్యాంటిన్ సిబ్బంది యూనిఫాం ధరించి విధులను నిర్వర్తించాలని కమిషనర్ సాంబశివరావు చెప్పారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన తెలిపారు.



## సెలవుల్లోనూ పన్నుల వసూలు!

### బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి వెల్లడి

**బాపట్ల, మార్చి 13, ప్రభాతవార్త:** బాపట్ల పురపాలక పరిధిలోని పన్నుల బకాయిదారులకు సౌకర్యవంతంగా ఉండేందుకు సెలవు దినాల్లో కూడా నగదు కౌంటర్లు పనిచేస్తాయని మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ మాట్లాడుతూ2025-26 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో, ఆస్తి పన్నుతో పాటు ఇతర పన్నుల బకాయిలను వసూలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు.. సాధారణంగా రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు అయినప్పటికీ, పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం పురపాలక కార్యాలయం మరియు ఆయా వార్డు సచివాలయాల్లోని నగదు కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని కమిషనర్ వివరించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.



పట్టణ అభివృద్ధికి పన్నుల చెల్లింపు కీలకమని, బకాయిదారులు ఎటువంటి జరిమానాలు పడకుండా గడువులోగా పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక అవకాశాన్ని పట్టణ ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకుని పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

## ముస్లిం సోదరులకు కోన ఇఫ్తార్ విందు

**కర్లపాలెం, మార్చి 13,ప్రభాతవార్త:** పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆధ్వర్యంలో కర్లపాలెం మండలంలోని పలు మసీదులకు ఇఫ్తార్ విందు కోసం శుక్రవారం పండ్లను పంపిణీ చేశారు. బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు యాలావుల ఏడుకొండలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా షేక్ తాజుద్దీన్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా రాజకీయాలకు అతీతంగా ఖికోన ఛారిటబుల్ ట్రస్ట్‌ఖి ద్వారా రఘుపతి ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కులమతాలకు తావులేకుండా ప్రతి ఏటా రంజాన్ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ఆయన సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, కోన రఘుపతికి మరియు ఈ రాష్ట్రానికి ఎల్లప్పుడూ మంచి జరగాలని ముస్లిం సోదరులందరూ మనస్ఫూర్తిగా అల్లాహ్‌ను ఖిదువాఖి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, ఇమ్రాన్ మరియు పార్టీ కార్యకర్తలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



## హోం కంపోస్ట్ పై అవగాహన కల్పించాలి : మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి13,(ప్రభాతవార్త):** మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పట్టణంలోని 22వ వార్డు తదితర ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు తో కలిసి పర్యటించారు.వార్డులోని కాలువలను పరిశీలించి శుభ్రం చేయించారు.కాలువలలో సిల్ట్ పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.వార్డులో అపార్ట్మెంట్లు గృహాలలో చేస్తున్న హోం కంపోస్ట్ ను పరిశీలించి ఇంకా ఎక్కువమంది హోం కంపోస్ట్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని శానిటరీ సెక్రటరీ తదితరులకు సూచించారు. ఎక్కువ మంది హోం కంపోస్ట్ చేయడం వల్ల చెత్తను అక్కడికక్కడే రీసైకిల్ అవుతుందని తద్వారా చెత్త పేరు పోకుండా ఉంటుందని అన్నారు. దానితోపాటు ఈ తడి చెత్తను ఎరువుగా చేసుకోవడం వల్ల మొక్కలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.పారిశుద్ధ్య నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని చెత్త,ఇతర వ్యర్థాలు కాలువల్లో వేయకుండా చూడాలని సూచించారు.హోమ్ కంపోస్ట్ పై ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సేంద్రియ ఎరువును వాడడం ద్వారా భూమి సారవంతం అవుతుందని అన్నారు. సానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్ సచివాలయ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యం

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**వట్టిచెరుకూరు, మార్చి13, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడుగుంట గ్రామం వద్దనున్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి టెక్నో, కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ సంస్కృతి2026 వేడుకల కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్య అతిథిగా









హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు ఉన్నత విద్య అందించడంలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కళాశాల ద్వారా గ్రామీణ కుటుంబాల నుంచి వచ్చిన వేలాది మంది బాలికలు సాంకేతిక విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తూ కుటుంబాలను, సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. మహిళా సాధికారతకు విద్యే బలమైన ఆధారం మని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతమైన బాలికలకు అవకాశాలు కల్పించి వారిని ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో ముందుకు తీసుకువెళ్తున్న ఈ విద్యాసంస్థ సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యతో పాటు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు కూడా విద్యార్థుల్లో పెంపొందేలా కళాశాల నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. గౌరవ అతిథి ప్రముఖ సినీగీత రచయిత చంద్రబోస్ పాల్గొని విద్యార్థినులను తన మాటలతో, పాటలతో ప్రేరేపించారు. తెలుగు సినీ రంగానికి వేలాది పాటలు రచించి, తన సృజనాత్మక ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. కష్టపడి సాధన చేస్తే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడం చాలా సులభం అన్నారు. గౌరవ అతిథిగా ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ హాజరై మాట్లాడుతూ.. తన సాన్నిధ్యంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ వారిని ఉత్సాహపరుస్తూ, స్టేజ్‌పై విద్యార్థులతో కలిసి నృత్యం చేసి అందరిని అలరించారు. ఆయన పాల్గొనడంతో విద్యార్థినుల్లో అపార ఆనందం వ్యక్తమైంది. కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం తమ విద్యాసంస్థ యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. విద్యతో పాటు నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా కళాశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థినులు చదువుతో పాటు సాంకేతిక, సాంస్కృతిక మరియు క్రీడా రంగాల్లో కూడా ప్రతిభను చాటాలని సూచించారు.

ఇలాంటి టెక్నో-కల్చరల్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలియజేశారు. ఈ సంవత్సరం నిర్వహించిన సంస్కృతి-2026 వేడుకల్లో రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ మరియు డిగ్రీ కళాశాలల నుంచి సుమారు పది వేల మంది విద్యార్థులు పాల్గొని వివిధ సాంకేతిక, సాంస్కృతిక మరియు క్రీడా పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమంలో విజేతలకు సుమారు రూ.5 లక్షల విలువైన నగదు బహుమతులు మరియు పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా ప్రత్యేకంగా నగదు బహుమతులు మరియు సత్కారాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రారంభములో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులను చప్పట్లు, పూలమాలలతో విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అతిథులను శాలువ, మెమొండోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కార్యక్రమ కన్వీనర్ ఎన్.చార్లెస్ జయరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ పి.రమేష్ బాబు, వివిధ శాఖల హెచ్‌ఓడిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రతిభ చూపాలి

## రాష్ట్ర ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ

**వట్టిచెరుకూరు, మార్చి13, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక, సాంస్కృతిక మరియు క్రీడా విభాగాలలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపాలని రాష్ట్ర ఈగల్‌ఐజి ఆకే రవికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని యనమదల గ్రామం వద్దనున్న కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాలలో గాలా 2కె26 పేరుతో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి యువజనోత్సవాల కార్యక్రమం



కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా రాష్ట్ర ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ హాజరై మాట్లాడుతూ..విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, గంజాయి, మత్తు పదార్థాలతో తమ విలువైన బంగారు భవిష్యత్ ను పాడుచేసుకోవద్దని వివరించారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిస కావద్దని, డ్రగ్స్ కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయం, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా యువత బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలియజేశారు. విద్యార్థులచే నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. మరో అతిథి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ..

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రమశిక్షణతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళిక బద్ధంగా లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేశారు. గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ..ఇటువంటి వేదికలు విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి దోహదపడతాయని చెప్పారు. సమాజం పట్ల



ప్రేమ, దయ, కరుణతో మేలగాలని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, సామాజిక సేవాభావాన్ని అలవర్చుకోవడం వల్ల దేశం అభివృద్ధి సాధిస్తుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉందన్నారు. విద్యార్థులు గురువుల సలహాలు సూచనలు పాటిస్తూ లక్ష్య సాధనకు కృషిచేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. వివిధ కళాశాల నుండి విచ్చేసిన విద్యార్థులకు పేపర్ ప్రెసెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రెసెంటేషన్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అకాడమిక్స్ లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అతిథులను శాలువా, మెమొండోలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డా. కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డా.కె. రామకోటయ్య, ప్రోగ్రామ్ కన్వీనర్ డా.షేక్. ఖమ్మారుద్దీన్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాల నుండి హాజరైన విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

**పెదనందిపాడు, మార్చి 13, (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండల కేంద్రంలో శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కవయిత్రి(కుమ్మర) మొల్లమాంబ 586వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు తొలుత ఆమె ఫోటోకు. పెదనందిపాడు శాలివాహన సంఘ మండల అధ్యక్షులు నిజాంపట్నం సుబ్బారావు. పలువురు సంఘ ప్రముఖులు పూల దండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ తమ శాలివాహన వృక్షానికి మాతృమూర్తి లాంటిది అన్నారు. తమ సంఘానికి కీర్తి ప్రతిష్టలు సాధించి పెట్టిన ప్రముఖులందరికీ ఈ సందర్భంగా వారు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన మండల సభ్యులు నాగభూషణం, మండల మహిళా అధ్యక్షురాలు చల్లగిరి సామ్రాజ్యం, చల్లగిరి వెంకటేశ్వరరావు, డాక్టర్ సిలివేరు రామకృష్ణ, గుగ్గిలం సాయిబాబు, పకీరరావు, సురేష్, లక్ష్మయ్య, రాంబాబు, డాక్టర్ సిలివేరు రామకృష్ణ, శాలివాహన కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# పాఠశాల ఎస్ఎస్‌సి విద్యార్థులకు పరీక్షల పై అవగాహన

**పెదనందిపాడు, మార్చి 13, (ప్రభాతవార్త) :** సోమవారం నుండి నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం పెదనందిపాడు నంది స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు. విజ్ఞాన సంస్థల అధినేత. ది పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ కరెస్పాండంట్ డాక్టర్. లావు రత్తయ్య పరీక్షల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదవ తరగతి విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటి వరకు అన్ని సబ్జెక్టులు ప్రిపరేషన్ పూర్తిచేసి వుంటారు, కనుక మీరు ఇప్పటి వరకు నేర్చుకొన్నవి పరీక్షలలో సమర్థవంతంగా రాయడానికి ప్రయత్నించండి. పరీక్షల సమయంలో టైమ్ ప్రకారకం ఆహారం తీసుకొని రాత్రి 9. గంటల కల్లా నిద్రపోవడానికి ప్రయత్నించండి. ఉదయం పూట నిద్ర లేచి మీరు చదివిన అంశాలను రికలెక్ట్ చేసుకోవాలని సూచించారు. సాధారణంగా మనం తినే ఆహారంలో 60 పోషకాలు మన మెదడు ఉపయోగించుకొంటుందని మిగిలిన 40 మన ఫీజికల్ యాక్టీవిటీస్ కొరకు ఉపయోగపడుతుందని కనుక పరీక్షల సమయంలో టైమ్ ప్రకారం ఆహారాన్ని తీసుకోవలసినదిగా పేర్కొన్నారు. మీరు మానసికంగా దృడంగా ఉంటేనే పరీక్షలు బాగా రాయగలరని. అలాగే ప్రశ్నపత్రంలో బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబు రాయవలెనని, ఒకటో రెండు జవాబు తెలియని ప్రశ్నలున్నను వాటిని కూడా బాగా అలోచించి రాయటానికి ప్రయత్నించవలెనని సూచించినారు. విద్యార్థిని విద్యార్థులు జవాబులు రాసేటప్పుడు హెడ్డింగ్ లను మరియు ముఖ్యమైన పాయింట్స్ ను అండర్ లైన్ చేయడం ద్వారా ప్రస్నాపత్రాలు దిద్దే వారికి ఆ విద్యార్థులపై మంచి అభిప్రాయం కలుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమములో పాఠశాల పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య. పి.ఏ.ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. వీర రాఘవయ్య . పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లూరి సత్యనారాయణ. పాఠశాల ఉపాధ్యాయులు. కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



# వేమూరులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

**వేమూరు, మార్చి 13, (ప్రభాతవార్త) :** మండల కేంద్రం వేమూరులో పంచాయితీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మెయిన్‌రోడ్డులోని ఇరు వైపులా ఉన్న కాలు వలో పూడిక తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీ కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూడిక తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్నాళ్ళుగా కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు పారుదల లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇది గ్రహించిన పంచాయితీ అధికారులు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు పూడిక తీసే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీలో సుభాష్ చంద్రబోస్, కోటేశ్వరరావులు పర్యవేక్షించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ చంద్రపాల్ నేతృత్వంలో డ్రైవ్‌లో పూడికతీత కార్యక్రమం వేగంగా కొనసాగుతుంది.





# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి టౌన్, మార్చి13,(ప్రభాతవార్త):** రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా అన్నదాతలకు అండగా ఉండే దిశగా,చేపట్టే చర్యల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు



ఆర్థిక సహాయంతో, ప్రతి రైతు కళ్ళల్లో ఆనందాన్ని చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు మూడవ విడత ఆర్థిక సహాయానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నేడు తెనాలి డివిజన్లోని రైతులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానం ద్వారా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని విచ్చేసిన రైతులకు వినిపించారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతల సేవలో ఉన్న మంచి ప్రభుత్వమని రాష్ట్రంలో కానీ దేశంలో కానీ డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధిలో పరుగులు పెడుతున్న యంత్రాంగమని, సాగుభూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం14 వేల రూపాయలు పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రు 6000 మొత్తంగా సంవత్సరానికి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని, నేడు మూడవ విడత అందిస్తున్న ఆర్థికసహాయం లో తెనాలి డివిజన్లో13వేల మంది రైతులకు సుమారు7 లక్షల కోట్లరూపాయలను ఈ అన్నదాత సుఖీభవ పథకం క్రింద అందజేయడం జరుగుతుందని,కేంద్ర ప్రభుత్వ వాటా రు.6000 రాష్ట్ర ప్రభుత్వ వాటా రు.6000 కలిపి నేడు అంద జేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ ప్రభుత్వ అందిస్తున్న సహాయంతో మరింతగా పంట ఉత్పత్తులను పెంచి తమ ఆదాయాన్ని పెంచుకోవాలని, అలాగే వరి పంటతో పాటు ఉద్యాన రైతులకు,ప్రకృతి వ్యవసాయం చేసేవారికి, బిందుసేద్యం ద్వారా వ్యవసాయం చేసే రైతులకు, 90 సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మరియు ఇతర యంత్రాలు ఏర్పాటు చేయబోతుందని, అంతేకాకుండా గత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు 24 గంటల్లోనే చెల్లింపులు చేసి వారి ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందని, వ్యవసాయంతో పాటు పాడి రైతులకు ఆక్వా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ విజయబాబు, మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు, కొల్లిపర మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ పాలడుగు సురేంద్ర, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి, పలువురు కూటమి ప్రభుత్వ నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# తెనాలిలో విద్యుత్తు విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**తెనాలి టౌన్, మార్చి13,(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్ సిబ్బంది గుంటూరు వారిచే తెనాలి పట్టణంలో గురువారం పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. డి వన్ సెక్షన్ పరిధిలోని నిర్వహించిన ఈ తనిఖీల్లో విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ ఏ కరీం మరియు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ నేతృత్వంలో సిబ్బంది 45 బృందాలుగా, 135సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 3289 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అనుమతించిన కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ఐదుగురి నుండి లక్ష రూపాయలు జరిమానా వసూలు చేశారు. అంతేకాకుండా,పరిమితికి మించి అధిక విద్యుత్ వాడుకుంటున్న 138 మంది నుండి రు5.71లక్షలు జరిమానా వసూలు చేశారు. మొత్తంగా రు.6.71లక్షలు జరిమానా అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడే ఉంటాయని, వినియోగదారులందరూ వారి విద్యుత్ సర్వీసులకు సీలు ఉండేట్లు చూసుకోవాలని ఒకవేళ ఫీల్ లేకుండా పాడైపోయిన సీలు విరిగిపోయి ఉన్నా విద్యుత్ సిబ్బందికి తెలియపరచాలని అలా చేయకుండా విద్యుత్ వాడుకున్నట్లయితే లేక నిర్దేశించిన మీటరు బదులు వేరొక మీటరుతో విద్యుత్ వాడుకున్న భారత విద్యుత్ చట్టం సెక్షన్



135 ప్రకారం కేసు నమోదు చేసి జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ సౌర్యం సామాజిక నేరమని అక్రమ విద్యుత్ వాడుకున్నట్లయితే అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని కావున వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని, అధికారులు సూచించారు. ఈ దాడుల్లో, అధికారులు బి అశోక్ కుమార్, ఎన్ మల్లికార్జున ప్రసాద్,సిహెచ్ దుర్గారావు, యు శివశంకర్ పలువురు డిఈలు,ఏఈ లు పాల్గొన్నారు.

# ఒత్తిళ్లే మానసిక వైఖల్యానికి మూల్యం

**కొల్లూరు, మార్చి 13, (ప్రభాతవార్త) :** సమాజంలో ఒత్తిళ్ళు ప్రభావమే మానసిక వైకల్యానికి దారితీస్తుందని కొల్లూరు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. శుక్రవారం కొల్లూరు 9వ అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మెంటల్ హెల్త్ మరియు గృహ హింస అనే అంశాలపై తల్లులకు



గర్భవతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ నేటి యువతరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలున్న వారి శాతం పెరుగుతుందన్నారు. భయంకరమైన సంఘటనలు సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందటం సర్వసాధారణమైన కారణంగా చెప్పవచ్చును అన్నారు. మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మానసిక రుగ్మతులు ఉన్న వారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉందన్నారు. మహిళ రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన కొన్ని చట్టాలను ఆమోదించిందన్నారు. గృహహింస చట్టం, ఫోక్సో చట్టం, దిశ యాప్ వంటే చట్టాలను కఠినంగా అమలు చేస్తుందన్నారు. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరిగితే ఫోక్సో చట్టం ద్వారా త్వరితగతిన న్యాయం జరిగే విధంగా చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల గురించి తల్లులకు, కిశోర బాలికలకు వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, రత్నకుమారి, హెల్పర్ సుజాత, తల్లులు, గర్భవతులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# అల్లా మార్గం అనుసరణీయం

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి13,(ప్రభాతవార్త):** పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తెనాలి మండల తెలుగు యువత అధ్యక్షులు శాఖమూరి సురేంద్ర ఆధ్వర్యంలో, తౌసి ఫర్నిచర్ వారి సౌజన్యంతో, స్థానిక నందులపేటలోని పిఎన్సి క్లబ్ వద్ద, రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.



శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం. ఎంఎల్సి ఆలపాటి మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డించటం చాలా ఆనందంగా ఉందని, రంజాన్ పండుగ అంటేనే త్యాగానికి ప్రసిద్ధి అని, ముస్లింల ఐక్యతకు తోటి వారికి సహాయం చేసే వారి దాతృత్వానికి అల్లా అండగా ఉంటాడని, ప్రతి ఒక్కరూ అల్లా మార్గంలో పయనించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు, పట్టణ తెదేపా అధ్యక్షులు ఎండి. ఖుద్దూస్, మండల తెలుగుయువత అధ్యక్షులు శాఖమూరి సురేంద్ర, సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు, పలువురు మైనారిటీ నాయకులు, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**కొల్లిపర, మార్చి 13, ప్రభాతవార్త:** మండలంలోని మున్నంగి పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. మై గుడ్ శ్రీనివాస్ ఫౌండేషన్ స్థాపకుడు మిరియాల యాకోబు 45 మంది పదో తరగతి విద్యార్థులకు



ఎగ్జామినేషన్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని చెప్పారు. పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఉన్నత విద్యలోకి ప్రవేశించేందుకు పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించేలా ప్రతిభ చూపాలని ఆయన కోరారు. యాకోబ్ సేవలను పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ వై. శ్రీనివాసరావు కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. అప్పారావు మాట్లాడుతూ ఏటా 10వ తరగతి విద్యార్థులకు గొప్ప మనసుతో సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త సంక్షేమం జనసేన పార్టీ లక్ష్యం

## -జనసేన పార్టీ నేత వెంకట శివయ్య

**వేమూరు మార్చి 8 (ప్రభాతవార్త) :** జనసేన పార్టీ కార్యకర్తల అభ్యున్నతే లక్ష్యంగా జనసేన పార్టీ అధినేత అధినేత పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని జనసేన పార్టీ సీనియర్ నేత వెంకట శివయ్య తెలియజేశారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ శ్రేణులకు సభ్యత్వ నమోదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పరిశీలకులు ఉంగుటూరు శాసన



సభ్యులు ధర్మరాజు సూచన మేరకు ఇప్పటి వరకు వేమూరు నియోజకవర్గంలో 4000సభ్యత్వాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. తన ద్వారానే వెయ్యి సభ్యత్వాలు పూర్తి చేయడం ద్వారా పార్టీ పరిశీలకుల నుండి అభినందనలు పొందినట్లు ఆయన గుర్తు చేశారు. జనసేన పార్టీ సభ్యత్వం పొందిన వారికి ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలియజేశారు. రానున్న రోజుల్లో వేమూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మరింత వేగవంతంగా జరిపించే విదంగా చర్యలు తీసుకుంటున్నామని వెంకట శివయ్య తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల పార్టీ ఉపాధ్యక్షులు దాది సీతారామయ్య, బచ్చు పవన్‌కుమార్, గాజుల తిరుమలరావు తదితరులు ఉన్నారు.

# అక్రమ ఇసుక రవాణా పై చర్యలు తీసుకుంటాం

**కొల్లిపర, మార్చి 13, ప్రభాతవార్త:** కృష్ణా నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని కొల్లిపర తహశీల్దార్ సిద్ధార్ధ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కొల్లిపర, మున్నంగి, బొమ్మువానిపాలెం ఉచిత ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో ట్రాక్టర్‌కు లోడు చేసినందుకు కూలీలకు రూ.600 మాత్రమే చెల్లించాలని చెప్పారు. ఎవరైనా అదనంగా వసూళ్ళకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఉచిత ఇసుక విధానం మండల పరిధికే పరమితమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత ఇసుక అవసరమైన వినియోగదారులు ఆయా గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శికి సరైన ధృవప త్రాలతో దరఖాస్తు చేసుకున్న వెంటనే సచివాలయంలో అనుమతి ధృవీకరణ పత్రం జారీ చేస్తారని చెప్పారు. ఈ ధృవీకరణ పత్రాన్ని తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వస్తే ఇసుక రవాణాకు అనుమతినిస్తామని సిద్ధార్ధ తెలిపారు. కూలీల ద్వారా మాత్రమే ఇసుకను ట్రాక్టర్లలో నింపుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, విఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



## ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న ఖలీల్‌ను గుర్తుంచుకోవాలి

**కొల్లిపర,మార్చి 13, ప్రభాతవార్త:** ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న ఖలీల్‌ను ముస్లిం సోదరులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని ఎస్ఐ ఎనసి ప్రసాద్ చెప్పారు. శుక్రవారం కొల్లిపరలో డాక్టర్ జాఫర్ సాదిక్ బాషా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా 100 మంది నిరుపేద మహిళలకు ఎస్ఐ ప్రసాద్ ముస్లిం నాయకులతో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదలైన ముస్లిం కుటుంబాలను ఖలీల్ లక్షలాది రూపాయలు




ఖర్చుచేసి వారిని ఆదుకోవడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ జాఫర్ సాదిక్ భాషా ట్రస్టు అధ్యక్షుడు షేక్ ఖలీల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పండుగకు పేదలకు సహాయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ రఫీ, షేక్ వలీ, షేక్ అల్లాభక్షు, షేక్ బాజీ, షేక్ రహమ్‌తుల్లా, షేక్ హేతాన్, పటాన్ మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె పారిశుద్ధ్య సిబ్బంది ర్యాలీ

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేపల్లె పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ పాలిథిన్‌ను వినియోగించరాదని చెప్పారు. ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 16న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**రేపల్లె, మార్చి 13, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ సమావేశం జరుగుతుందని ఛైర్‌పర్సన్ కట్టా మంగ శుక్రవారం తెలిపారు. ఎజెండాలో పొందుపరచిన 43 అంశాలపై చర్చించి ఆమోదం తెలపాల్సి ఉన్నందున కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

## తీర ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

**నగరం, మార్చి 13, ప్రభాతవార్త:** తీర ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా దివీస్ లాబొరేటరీస్ సహాయంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి అన్నారు. శుక్రవారం దివిస్ లేబరేటరీస్ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఇంటర్వ్యూలో 70 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు 22 మందిని షాప్ లిస్ట్ చేయబడిందని తెలిపారు. ఈ



ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన వారికి ఆఫర్ లెటర్స్ ఫైనల్ వెరిఫికేషన్ తర్వాత అభ్యర్థులకు మెయిల్ వస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఇంటర్వ్యూలు మరిన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాలను ఉపయోగించుకొని వారి భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దివీస్ లాబొరేటరీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవతో రైతులకు ఆర్థిక ప్రయోజనం : ఎమ్మెల్యే ఆనందబాబు

**భట్టి ప్రోలు(రేపల్లె), మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ఆర్థిక ప్రయోజనం నెరవేరుతున్నదని వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చెప్పారు. శుక్రవారం భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్



యార్డులో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి విజయలక్ష్మి అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుకు రూ.14 వేలు వంతున అందించడం జరుగుతున్నదని చెప్పారు. రైతులకు నిధులతో పాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సకాలంలో పంటల దిగుబడులను విక్రయించుకునేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మిల్లులకు తరలించి రెండో రోజునే నగదు చెల్లింపులు జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం గర్వకారణమ న్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా రూ.6 వేలు జమచేస్తున్నదని తెలిపారు. అంటే రైతుకు రూ.20 వేలు లబ్ధి చేకూరుతున్నదని ఆయన వెల్లడించారు. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మినుములు అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆనందబాబు కోరారు. బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పంటలు సాగు చేసే విషయంలో రైతులు యాజమాన్య పద్ధతులను అవలంబించాలని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని ఆయన సూచించారు. మొక్క జొన్న, జొన్న పంట కోత పూర్తయ్యాక కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. అప్పుడే భూమి సారవంతమవుతుందన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి కెఎల్.ప్రభాకర్ రావు, రేపల్లె ఆర్డీవో గ్లోరియా, భట్టి ప్రోలు మండల ప్రత్యేక అధికారి వేణుగోపాలరావు, ఎంపిడివో ఎస్.వెంకటరమణ, తహశీల్ధార్ ఎం.శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మోటూరు పుణ్య శ్రీనివాసరావు, వాకా శేషుబాబు, ప్రభుత్వ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ మార్గం సమాజాభివృద్ధికి మూలం : ఆచార్య శామ్యూల్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి13, ప్రభాతవార్త:** తన జ్ఞానంతో ప్రపంచ మేధావులను సైతం భారత్‌వైపు చూసేలా చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ఆయన మార్గం అభివృద్ధికి మూలంగా నిలుస్తుందని ఏఎన్‌యు మాజీ పాలకమండలి సభ్యులు, అంబేద్కర్ చైర్ మాజీ ప్రొఫెసర్ ఆచార్య నాలాది శామ్యూల్ అన్నారు. డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో రూసా 2.0 ఆర్థిక సహకారంతో రెండు రోజులుగా జరుగుతున్న ఇంపాక్ట్ ఆఫ్ టెక్నాలజీ ఆన్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆచార్య శామ్యూల్ మాట్లాడుతూ నేటటి యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని దానికి మంచికి ఉపయోగించుకోవాలన్నారు. చెడుకు వినియోగిస్తే క్రిమినాలజీ పెరిగే అవకాశం ఉందన్నారు. అంబేద్కర్‌లోని పోరాటపటిమ, సాధించాలనే తపన, లక్ష్యం సాధనకు ఉన్న పట్టుదలలను నేటితరం యువత అలవర్చుకోవాలని




సూచించారు. మరొక అతిథిగా పాల్గొన్న దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేసే క్రమంలో అంబేద్కర్ ఆలోచన విధానం దోహదపడుతుందన్నారు. సమాజంలో పెరుగుతున్న రుగ్మతలను సాంకేతిక పరిజ్ఞానంతో అదుపుచేయాలన్నారు. ప్రముఖ న్యాయవాది డా.మద్దు అంకయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు తన ఉద్యోగాన్ని సైతం వదులుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే అంబేద్కర్ ఆశించిన లక్ష్యం కోసం రాజకీయ పార్టీని ఏర్పాటుచేసినట్లు వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆచార్య జి.వి.రత్నాకర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు అంబేద్కర్‌ను అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వై.అశోక్‌కుమార్ సదస్సు విజయవంతం చేసినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ముగింపు సభకు అధ్యక్షత వహించిన అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ మాట్లాడుతూ రెండు రోజులుగా అంబేద్కర్ ఆలోచనా విధానం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, సామాజిక పరివర్తన అంశాలపై సుదీర్ఘ చర్చలతో పాటు పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పించారని అన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సదస్సులో విభాగం సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, ఎన్.అబ్రహం, ఎస్తేరురాణి, పరిశోధకులు పాల్గొన్నారు.

## కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు అనుమతించడం సముచిత నిర్ణయం

**గుంటూరు కల్చరల్, మార్చి 13, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు గాయపడి దాదాపు 13ఏండ్లుగా కోమాలో ఉన్న ఒక యువకుడి కారుణ్య మరణానికి అనుమతించి సుప్రీంకోర్టు సముచిత నిర్ణయం తీసుకుందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. కోలుకుంటాడన్న ఆశలేశమైనా లేని కన్న కొడుకుని కళ్ళముందు పెట్టుకొని జీవిస్తున్న తల్లిదండ్రుల వేదనను మనసుతో చూసి అర్ధం చేసుకొని న్యాయమూర్తులు ఈ తీర్పునిచ్చారని అవగాహన సంస్థ భావిస్తుంది. గౌరవప్రదమైన మరణానికి వీలుగా రాణా అనే యువకుడికి చికిత్స నిలిపివేయవచ్చుని ప్రకటించడం ద్వారా దేశంలో తొలిసారి ఒక వ్యక్తికి సర్వోన్నత న్యాయస్థానం కారుణ్య మరణాన్ని ప్రసాదించిందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

## అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

### తహశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** గృహ వినియోగానికి సంబంధించిన గ్యాస్‌ను వ్యాపార సంస్థల్లో వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ హెచ్చరించారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యాపార సంస్థలకు కమర్షియల్ సిలిండర్లను నిలిపివేసింది. దీంతో ఇంట్లో ఉపయోగించే గ్యాస్‌ను వ్యాపార సంస్థలు వినియోగిస్తున్న నేపథ్యంలో, వాటిని కట్టడి చేసేందుకు



విజిలెన్సు అధికారులు రంగంలోకి దిగారు. దీంతో నారాకోడూరు గ్రామంలోని నవీన రెస్టారెంట్‌లో మూడు గ్యాస్ సిలిండర్లు, ధరణి హోటల్‌లో మూడు గ్యాస్ సిలెండర్లు విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని తహశీల్దార్‌కు తెలిపారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

### వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని డీవీసి కాలనీలో షేక్ నాగూర్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ



సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత భక్తిప్రపత్తులు, కఠోర దీక్ష చేసే పండుగల్లో రంజాన్ అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మతాలకు అతీతంగా విందులు ఆరగించడం, పలు మతాలవారు ఆతిథ్యాలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీంలో నెల రోజుల పాటు కఠోరమైన ఉపవాస దీక్ష చేపట్టడం వారి నిబద్ధతకు, భక్తి పారవశ్యానికి నిదర్శనమన్నారు. అంబటి మురళీకృష్ణ మసీదులో ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని ఉపవాస దీక్ష విరమింపచేశారు. అనంతరం అంబటి ఉపవాసం చేసిన ముస్లీం సోదరులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, షేక్ నాజరు, యందేటి వెంకటసుబ్బయ్య, షేక్ మౌలాలి, గోపిశెట్టి వాసు, దక్కుమళ్ళరవి, పీర్‌సాహెబ్, మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథాలను ప్రారంభించిన నాయకులు

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 14పంచాయితీకు 20స్వచ్ఛ రథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత నివారణకు, వాటి నిర్వహణకు ఈ స్వచ్ఛ రథాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆయా గ్రామాల్లో చెత్త సేకరణకు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛ రథాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ వేముల శ్రీనివాసరావు, నాయకులు బండ్లమూడి బాబూరావు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, మొవ్వా వెంకటకృష్ణ, బొప్పన బాపనయ్య, గరిగంటి సాయిబాబు, చలమశెట్టి సీతారామయ్య, షేక్ బాజిసాహెబ్, యక్కటి పద్మారావు తదితరులున్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం : అనగాని శివప్రసాద్

**చెరుకుపల్లి, మార్చి 13, ప్రభాతవార్త :** ప్రభుత్వం యొక్క వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగానే శివప్రసాద్ అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కావూరు సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు మండవ తాతాజీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిసి చైర్మన్ ఎంఆర్కే మూర్తి




మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వ్యవసాయం దండగని రైతుల్లో లేనిపోని ఆపోహలు సృష్టించాలని ప్రయత్నించండి కానీ నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు ప్రయోజనాలే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను, నగదు ప్రోత్సాహకాలను అందిస్తుంది అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 53 వేల కోట్ల రూపాయలను వ్యవసాయ రంగానికి కేటాయించడం ప్రభుత్వం వ్యవసాయరంగం ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు. చెరుకుపల్లి మండలంలో 61 80 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద 2. 40 కోట్ల రూపాయలను, పీఎం కిసాన్ పథకం ద్వారా 4810 మంది రైతులకు 96 లక్షల రూపాయల్లో నిధులను వారి యొక్క ఖాతాలో జమ చేయడం రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వాలు అందిస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేసింది అన్నారు. గతంలో ధాన్యం అమ్మితే నెలల తరబడి రైతులకు డబ్బులు అందేవి కావని కానీ నేటి ఫోటో ప్రభుత్వం 48 గంటలలోపు రైతులు ఖాతాల్లో ధాన్యం తాలూకు నగదు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె జనసేన పార్టీ కన్వీనర్ మత్తి భాస్కరరావు, తాసిల్దార్ సిహెచ్ పద్మావతి, ఏవో ఫరూక్, గూడవల్లి సొసైటీ అధ్యక్షులు సురేంద్రబాబు, పూషడపు కుమారస్వామి, పిట్టు శ్రీనివాసరెడ్డి, బిజెపి నాయకులు సుద్దవరపు సురేష్, సొసైటీ సభ్యులు, గ్రామస్తుల, అధికారులు, పలువురు పాల్గొన్నారు.

## రైతుల గౌరవాన్ని కాపాడుతున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** రైతుల గౌరవాన్ని కాపాడుతూ నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ధూళిపాళ్ళనరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు,




దండమూడి గ్రామాలకు సంబంధించి రీ సర్వే పూర్తి అయినందున అర్హులందరికీ నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ రైతుల హక్కుల పత్రాలను కూడా గత ప్రభుత్వం వ్యక్తిగత ప్రచారానికి వాడుకుందన్నారు. భూముల హక్కులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన పత్రం పట్టాదారు పాసుపుస్తకమని చెప్పారు. అలాంటి కీలక పత్రాలపై హక్కుదారులైన రైతుల ఫోటోలు ఉండాల్సిన చోట గతంలో వైఎస్ జగన్మోహనరెడ్డి నాయకత్వంలోని వైసీపి ప్రభుత్వ కాలంలో వ్యక్తిగత అర్భాట ప్రచారం కోసం ప్రభుత్వ నాయకుల ఫోటోలు ముద్రించడం జరిగిందని విమర్శించారు. రైతుల హక్కులకు సంబంధించిన పత్రాలను కూడా రాజకీయ ప్రచారానికి వారుకోవడం దుర్మార్గమైన చర్యగా చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల గౌరవాన్ని కాపాడుతూ పారదర్శకంగా నిర్వహించిన రీ సర్వే తర్వాత భూముల వివరాలను పక్కాగా నమోదు చేసి రైతులకు సరైన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ మండలంలో ఈ రెండు గ్రామాలే కాకుండా ఇంకా పలు గ్రామాల్లో కూడా రీ సర్వే జరుగుతుందన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు. పచ్చలతాడిపర్రు గ్రామానికి సంబంధించి 524మంది రైతులకు, దండమూడి గ్రామానికి సంబంధించి 603మంది రైతులకు మొత్తం 1127మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, యన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కలిసి పనిచేస్తేనే నూతన ఆవిష్కరణలు సాధ్యం

### -సీఈఓ డాక్టర్ తర్నగిరి పోలవరపు -విజ్ఞాన్స్‌లో ప్రారంభమైన జీనోమిక్స్ రీసెర్చ్ సెంటర్

పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త: విజ్ఞాన్ శాస్త్ర పరిశోధనలకు విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేసినప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని జీనోమిక్స్ మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్, సీఈవో డాక్టర్ రత్నగిరి పోలవరపు తెలిపారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం జాతీయస్థాయి కాన్ఫరెన్స్ ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా బయోటెక్నాలజికల్ ప్రొడక్షన్ ఆఫ్ బయోయాక్టివ్ ఫైటోకెమికల్స్ ఆఫ్ మెడిసినల్ వ్యాల్యూ అనే పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం జీనోమిక్స్ సీఏఆర్‌ఎల్ ప్రైవేట్ లిమిటెడ్, విజ్ఞాన్స్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కన్సార్టియం సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ జీనోమిక్స్ రీసెర్చ్ సెంటర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రత్నగిరి పోలవరపు మాట్లాడుతూ జీనోమిక్స్ కార్ల్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియం ల్యాబొరేటరీ ప్రారంభం శాస్త్రీయ పరిశోధనలకు, బయోటెక్నాలజీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. సంస్థను ప్రారంభించడం అనేది కేవలం వ్యాపార ఆలోచనతో మాత్రమే సాధ్యం కాదన్నారు. దానికి స్పష్టమైన లక్ష్యం, పక్కా ప్రణాళిక, కృషి, నిబద్ధత అవసరమన్నారు. మనం రూపొందించే ఉత్పత్తి, సేవ నాణ్యతతో కూడినదిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బయోటెక్నాలజీ, ప్లాంట్ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు వైద్యరంగం, ఔషధ తయారీ, వ్యవసాయ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. విద్యార్థులు పరిశోధనా పరమైన దృక్పథాన్ని పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో అతిథి జబల్‌పూర్ మంగళయాతన్ యూనివర్సిటీ వీసి ప్రొఫెసర్ కెఆర్‌ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) వినియోగం రోజు రోజుకూ పెరుగుతూ పంటల అభివృద్ధి, సుస్థిర వ్యవసాయానికి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పంటల దిగుబడిని పెంచడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, నేల నాణ్యతను విశ్లేషించడం, వాతావరణ మార్పులను అంచనా వేయడం వంటి



అనేక అంశాల్లో ఏఐ సాంకేతికత రైతులకు ఎంతో సహాయపడుతోందని వివరించారు. మరోఅతిథి హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కేపీఎంఎస్‌వీ పద్మశ్రీ మాట్లాడుతూ మొక్కలలో జరిగే జీవక్రియలలో ఆల్టర్నేటివ్ ఆక్సిడేజ్ అనే ఎంజైమ్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కాంతి ప్రభావంలో మొక్కల శ్వాసక్రియ, శక్తి ఉత్పత్తి ప్రక్రియలను సమతుల్యం చేయడంలో ఈ ఎంజైమ్ ప్రభావం ఎంత ముఖ్యమో తన పరిశోధన ద్వారా వివరించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ ఆర్వి శ్రీధర్, బాపట్ల జిల్లా కూచిపూడికి చెందిన డాక్టర్ మేక జగన్మోహనరావు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వర్సిటీ ఇంచార్జివీసి కేవీ క్రిష్ణకిషోర్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ 8731మందికి లబ్ది : ఎడిఎ వి.రామకోటేశ్వరి

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** మూడవ విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పతకం లబ్దిదారులకు నగదును విడుదల చేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన అన్నదాత సుఖీభవ మూడవ విడత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పొన్నూరు మండలంలో ఈ పథకం ద్వారా 8,731మంది రైతులకు లబ్ది చేకూరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 349లక్షలు, పీఎం కిసాన్ కేంద్ర ప్రభుత్వ వాటా రూ.119లక్షలు మొత్తం రూ.4.65కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. ఈ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమైనదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతల ప్రయోజనం కోసమే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. రైతుల తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షుడు మాదల వెంకటేశ్వరరావు




మాట్లాడుతూ రైతులు ఈ సంవత్సరం వరి ధాన్యం ప్రభుత్వం ద్వారా అమ్ముకొని మద్దతు ధర పొందారన్నారు. రాయితీపై ఇచ్చిన డ్రోన్ల ద్వారా మొక్కజొన్న, జొన్న. తెల్లజొన్న పైర్లలో మందులు పిచికారికి ఉపయోగించుకొన్నారన్నారు. ఇది విప్లవాత్మకమైన మార్పు అని చెప్పారు. పార్లమెంట్ రైతు విభాగం నాయకులు బొర్రు రామారావు మాట్లాడుతూ రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వమన్నారు. రాబోయే రోజుల్లో మద్దతు తెలపాలని కోరారు. బండ్లమూడి బాబూరావు మాట్లాడుతూ ఇది రైతుల ప్రభుత్వ మని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రీ సర్వే నిర్వహించి రాజముద్రికతో నూతన పాసుపుస్తకాలను ఇచ్చిన ఘనత కూటమిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, నాయకులు చలమశెట్టి సీతారామయ్య, మొవ్వా వెంకటకృష్ణ, బొప్పన బాపనయ్య, షేక్ బాజిసాహెబ్, వల్లభనేని వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రూత్‌రాణికి పలువురు అభినందనలు

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి ఇటీవల గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలుగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు రూత్‌రాణిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రూత్‌రాణి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేషమైన సేవలు అందించారు. దీంతో పార్టీ అధిష్ఠానం గతంలో బాపట్ల పార్లమెంట్ పరిశీలకురాలుగా, బాపట్ల అసెంబ్లీ



పరిశీలకురాలుగా కూడా నియమించింది. ప్రసుత్తం గుంటూరు తూర్పు పరిశీలకురాలుగా నియమించడంతో రూత్‌రాణిని పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. గేరా సుబ్బయ్య, షేక్ షఫాయితుల్లా, దక్కుమళ్ళ రవి, బోయిన శివనాగరాజు, చక్కా హరీష్, సిహెచ్ మురళీకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకటసుబ్బయ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

## ఆరోగ్యకరమైన మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలి

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా పురపాలక సంఘాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన



పట్టణంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో గురువారం అపార్టుమెంట్ల అసోసియేషన్, హోటళ్ళ యజమానులు, రెస్టారెంట్ యజమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బల్క్ వేస్ట్ జనరేటర్లు(ఎక్కువ మొత్తంలో చెత్తను ఉత్పత్తి చేసే అపార్టుమెంటలు, హోటళ్ళు)తమ ప్రాంగణంలోనే చెత్తను తడి, పొడి, హానికరమైన వ్యర్థాలను వర్గీకరించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, మునిసిపల్ నిబంధనల ప్రకారం, ప్రతి అపార్టుమెంట్, వ్యాపార సంస్థ విధిగా చెత్తను వేరు చేయాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను విడిగా ఉంచి, మునిసిపల్ వాహనాలకు మాత్రమే అందజేయాలన్నారు. డ్రైనేజిల్లో, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకూడదన్నారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పిన్నిబోయిన పోతురాజు, శానిటేషన్ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దక్కుమళ్ళ



**పొన్నూరు, మార్చి 13, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన వైకాపా నాయకుడు దక్కుమళ్ళ రవిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. దక్కుమళ్ళ రవి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. గతంలో కూడా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో పార్టీ అభివృద్ధికి, పార్టీ అమలు చేసే వివిధ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అందరి నాయకులను కలుపుకొని ముందుకు సాగారు. ప్రస్తుతం గతంలో లాగానే ఈసారి కూడా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. దక్కుమళ్ళ పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించే మళ్ళీ రాష్ట్రస్థాయి పదవి కట్టబెట్టిందని పలువురు నాయకులు చెప్తున్నారు.

